J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 40 సంచిక : 41 19.3.2021, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## పుర పోరులో
# జగన్‌కే జై కొట్టిన జనం

**11 కార్పొరేషన్లు**
**17 పంచాయితీలు**
**55 మునిసిపాలిటీలు**
**వైసిపి వశం!**

## చంద్రబాబుని తరిమికొట్టారు
## నలభై ఏళ్ళ అనుభవానికి నలుగు పెట్టారు



*జగన్‌మోహన్‌రెడ్డి : 48 సంవత్సరాల యువ ముఖ్యమంత్రి, గడప దాటలేదు, పెదవి విప్పలేదు. ఓట్లు అడగలేదు, తాయిలాలు ప్రకటించలేదు. పాలనపై దృష్టి పెట్టాడు, విశ్వసనీయతను నమ్ముకున్నాడు, జనం ఈ యువ కిశోరాన్ని ఆదరించి ఆశీర్వదించారు.*

*చంద్రబాబు : 40 సంవత్సరాల అనుభవశాలి. స్థానిక ఎన్నికల కోసం మేనిఫెస్టో విడుదల చేశాడు, ఊరూరా తిరిగాడు, అరచి గగ్గోలు పెట్టాడు, సిగ్గు శరం ఉంటే వైసిపికి ఓటెయ్యొద్దన్నాడు, కానీ ఓటర్లు ఆ వృద్ధ నాయకుడిని ఉతికి ఆరేశారు.*

రాష్ట్రంలో తాజాగా జరిగిన పురపాలక ఎన్నికలలో ఆంధ్రా ప్రజలు ఏకపక్ష తీర్పు చెప్పి స్థానిక ఎన్నికల చరిత్రలో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. కొన్ని చోట్ల అసలు ప్రతిపక్షమే లేదన్నట్లుగా 'ఓటెత్తి'న ఓటరు, తాము ఒకసారి డిసైడ్ అయితే వార్ వన్ సైడే అన్న సందేశాన్ని ఇచ్చారు. జనహితమే ధ్యేయంగా పనిచేస్తున్న రాజన్న వారసుడే తమ అభిమాన నాయకుడని మరోసారి చెప్పకనే చెప్పారు. 22 నెలలుగా రాష్ట్రాన్ని పాలిస్తున్న జగనన్నే తమకు నిజమైన పాలకుడని ఓటుగుద్ది చెప్పారు.

### మనసులు దోచుకున్న ముఖ్యమంత్రి...

కష్టం వెనకే సుఖం ఉంటుందంటారు, కష్టేఫలి అని కూడా చెప్తారు. అది జగన్ మోహన్‌రెడ్డి విషయంలో అక్షరాలా రుజువయ్యిందనే చెప్పాలి. చేయని నేరానికి కటకటాల

10 లో



● తిరుపతి పార్లమెంటు
## ఉపఎన్నికకు గంట మోగింది


పుర ఎన్నికలలో అఖండ విజయం సాధించిన వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విజయోత్సవ సంబరాలు చేసుకుంటోంది. ఘోర పరాజయంతో కుమిలిపోతున్న ప్రతిపక్షపార్టీలు మరోవైపు బోరున రోదిస్తున్నాయి. ఇదే తరుణంలో ఇప్పుడు

11 లో



● బాబు & కో కి నోటీసులు
## కలిసిరాని 23/3





*23/3 నంబర్లకు ఆంధ్రాలోని రాజకీయాలకూ ఏదో విడదీయలేని బంధం ఉన్నట్టుంది.*

2014 తరువాత తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు తమకు పూర్తి మెజారిటీ ఉన్నప్పటికీ, ప్రతిపక్షంలో ఉన్న వైసీపీ నుంచి 23 మంది

11 లో



## కండలేరు ఎడమగట్టు కాలువకు...

# త్వరలోనే మహర్దశ

**● ఆధునీకరణకు రూ.39.12 కోట్లు మంజూరు**

కండలేరు ఎడమగట్టు కాలువకు మహర్దశ పట్టనుందని సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి వెల్లడించారు. మంగళ వారం ఆయన మాట్లాడుతూ కాలువ ఆధునికీకరణకు ప్రభుత్వం రూ. 39.12 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఈ మేరకు పరిపాలనాపరమైన అనుమతులు లభించినట్లు పేర్కొన్నారు. కండలేరు రిజర్వాయర్ 0 కి.మీ. నుంచి 22,625 కి.మీ. వరకు కాలువ లైనింగ్ పనులకు నిధులను మంజూరు చేసినట్లు వెల్లడించారు. టీడీపీ ప్రభుత్వంలో ఎడమకాలువ ఎత్తిపోతల ద్వారా 2 వేల ఎకరాలకు కూడా సాగు నీటిని అందించలేకపోయిన విషయాన్ని గుర్తుచేశారు. స్లూయిజ్‌లు, కాలువ లైనింగ్ పనులను పట్టించుకోలేదని, ఇందువల్ల ప్రతి ఏటా సాగునీరు సక్రమంగా పొలాలకు అందడం లేదన్నారు. దివంగత నేత వైఎస్సార్ మెట్టరైతులకు సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా కాలువను నిర్మిస్తే ఆయన తనయుడు వైఎస్ జగన్ లైనింగ్ పనులకు నిధులను వెచ్చించి శాశ్వత ప్రాతిపదికన పనులను చేయిస్తున్నట్లు తెలిపారు. జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎత్తిపోతల పథకంతో సంబంధం లేకుండానే గ్రావిటీ ద్వారా రైతులకు 20వేల ఎకరాలకు అందజేసినట్లు తెలియచేశారు. సర్వేపల్లి నియోజకవర్గంలో రైతు భరోసా పథకం ప్రారంభం సందర్భంగా విచ్చేసిన సీఎంకు నిధులను విడుదల చేయాలని విజ్ఞప్తి



చేశానని, సీఎం సానుకూలముగా స్పందించిన విషయాన్ని గుర్తుచేశారు. అందులో భాగంగానే జీఓఆర్‌టీ నంబర్ 86ను సోమవారం విడుదల చేసినట్టు తెలిపారు. భవిష్యత్తులో ఎడమకాలువ ద్వారా దాదాపుగా అన్ని గ్రామాలకు సాగునీటిని అందించి పంటలు పండించుకునేందుకు ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామన్నారు.

## విద్యార్థుల నుంచి


# అధికఫీజులు తీసుకుంటే చర్యలు



ప్రొ. వి.నారాయణరెడ్డి

కార్పొరేట్ స్కూళ్ళలో, ప్రైవేట్ బడుల్లో విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ఆ పాఠశాలల గుర్తింపును రద్దు చేస్తామని ఏపి స్కూల్ ఎడ్యుకేషన్ రెగ్యులేటరీ అండ్ మానిటరింగ్ కమిషన్‌సభ్యులు ప్రొఫెసర్ వి.నారాయణరెడ్డి హెచ్చరించారు.

ఈనెల 17న ఆయన నెల్లూరు నగరంలోని పలు ప్రైవేట్ పాఠశాలలను తనిఖీ చేశారు. విద్యార్థులకు వసతులు ఎలా ఉన్నాయో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెఇఇ, నీట్ పేరుతో పలు విద్యా సంస్థలు విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని, అంతేకాకుండా ఆ విద్యా సంస్థల్లో అనేక రకాలుగా అధికమొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నారని చెప్పారు. త్వరలోనే వార్డు సచివాలయం, గ్రామ సచివాలయాల సహకారంతో 1వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఫీజుల వివరాలను డిస్‌ప్లే బోర్డుల మీద ప్రకటించే విధంగా ఏర్పాట్లు చేస్తామన్నారు. కరోనా నేపథ్యంలో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న ప్రజలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఫీజులు తక్కువగా వసూలు చేసేలా చర్యలు తీసు కుందని, దీనిని అన్ని పాఠశాలల వారు పాటించాలని ఆదేశించారు. ఆయన వెంట ఆర్‌జెడి రవీంద్రనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## టిడిపి నేతలపై

# కక్షసాధింపు తగదు

**- బీద రవిచంద్ర**



టిడిపి నేతలపై వైకాపా ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడడం తగదని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర అన్నారు. ఈనెల 17న ఆయన నెల్లూరులోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి అవినీతి మరక అంటించాలని ముఖ్యమంత్రి ప్రయత్నిస్తున్నారని, అందుకే చంద్రబాబు నాయుడు, నారాయణలకు నోటీసులు ఇవ్వడం దారుణమన్నారు. టిడిపి నేతల వ్యక్తిత్వాన్ని దెబ్బతీయడానికే ఇదంతా చేస్తున్నారని, ఇవన్నీ కక్షసాధింపు చర్యలేనని ఆరోపించారు. ప్రభుత్వం తమపై ఎన్ని కేసులు పెట్టినా ధైర్యంగా ఎదుర్కొంటామన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు షేక్ అబ్దుల్ అజీజ్, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, మలిశెట్టి వెంకటేశ్వర్లు, పనబాక భూలక్ష్మి, ఉచ్చి భువనేశ్వరిప్రసాద్ పాల్గొన్నారు.

## బాలల హక్కుల రక్షణలో

# ప్రధానోపాధ్యాయులే కీలకం

బాలల హక్కులను రక్షించడంలో ప్రధానోపాధ్యాయుల పాత్ర కీలకమని పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నగరంలోని గోమతినగర్‌లో 'పాఠశాల విద్యార్థుల భద్రత' అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలలకు హక్కులు, చట్టాలు తెలియజేసి చైతన్యం చేయాలని కోరారు. డీఈఓ పి.రమేష్ మాట్లాడుతూ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు తరచూ తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి హక్కులపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఈశ్వరయ్య, వి.నారాయణరెడ్డి, టి.వి.శ్రీనివాసన్, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

● రెండు దశాబ్దాల నాటి స్వప్నం.. నెరవేరబోతోంది

## ప్రసన్నకు ఇచ్చిన...

# మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి


సీఎం జగన్‌తో ఎమ్మెల్యే ప్రసన్న (ఫైల్‌ఫోటో)

*చిత్తశుద్ధి, సంకల్పం ఉండాలే గానీ ఎంతటి పనులైనా సాధ్యమవుతాయి. ఎన్నో ఏళ్ళుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలు కూడా పరిష్కారమై ప్రజలకు మేలు చేస్తాయనేందుకు త్వరలో నిర్మాణానికి సిద్ధమవుతున్న ముదివర్తిపాళెం కాజ్‌వేయే ఒక తాజా ఉదాహరణ. అపరభగీరథుడు నల్లపరెడ్డి ప్రసన్నకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ జననేత జగన్‌మోహన్‌రెడ్డి అందుకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో దాదాపు 10వేల ఎకరాలకు సాగునీరు, 40 గ్రామాలకు తాగునీరు అందించే ఈ బృహత్తర పథకం ప్రజలకు అందుబాటులోకి రానుంది. ఎన్నో ఏళ్ళుగా ఈ ప్రాంత ప్రజలకు కలగానే ఉన్న ఈ కాజ్‌వే.. త్వరలోనే సాకారం కానుంది.*

కాజ్‌వే నిర్మితం కానున్న ప్రదేశం


- **ముదివర్తిపాళెం సబ్‌మెర్సిబుల్ కాజ్‌వేకి గ్రీన్‌సిగ్నల్**
- **93.92 కోట్ల నిధులతో త్వరలోనే పనులు**
- **10 వేల ఎకరాలకు సాగునీరు**
- **40 గ్రామాలకు తాగునీరు**

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. 2018లో ఆయన పాదయాత్ర సందర్భంగా కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న ఎంతోకాలంగా ప్రజలు ఎదురు చూస్తున్న ఈ కాజ్‌వే గురించి చెప్పగా తప్పకుండా ఈ పని చేయిస్తామని హామీ ఇచ్చిన జగన్, ఇప్పుడు ఆ వాగ్దానాన్ని నెరవేరుస్తూ కాజ్‌వే నిర్మాణానికి అనుమతించడమే కాక 93.32 కోట్ల రూపాయల నిధులను కూడా కేటాయించారు. ఆమేరకు తాజాగా ప్రభుత్వం నుంచి ఈనెల 16న జిఓ కూడా విడుదలైంది. వివరాలిలా ఉన్నాయి.

ఇందుకూరుపేట మండలంలోని ముదివర్తిపాళెం, విడవలూరు మండలంలోని ముదివర్తి గ్రామాల మధ్య సబ్‌మెర్సిబుల్ కాజ్‌వే నిర్మిస్తే పెన్నాజలాలు వృధా కాకుండా ఉండడమే కాక, ఈ ప్రాంతాల్లో భూగర్భజలాల నీటిమట్టం బాగా పెరుగుతుందని ఎమ్మెల్యే ప్రసన్న గతంలో 2007 లోనే దివంగత నేత వైఎస్సార్ దృష్టికి తీసుకువచ్చారు. అయితే, అందుకు అనుమతులు మంజూరయ్యే సమయానికి ఆయన మరణించడంతో ఈ ప్రతిపాదనలు ముందుకు సాగలేదు. ఇదే విషయాన్ని 2018లో కోవూరు నియోజకవర్గంలో ప్రజాసంకల్ప యాత్ర సందర్భంగా వైఎస్ తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి చెప్పగా, తప్పకుండా ఈ కార్యం నెరవేరుస్తామని ప్రసన్నకు హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఇప్పుడు ముఖ్యమంత్రి జగన్ ఈ కాజ్‌వే పనులు త్వరితగతిన పూర్తయ్యేందుకు అవసరమైన అనుమతులను ప్రభుత్వం ద్వారా మంజూరు చేయించడం పట్ల ప్రజలంతా ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తీరంలో భూగర్భ జలాలు కలుషితం కాకుండా ఉండేందుకు నిర్మించాలనుకున్న ఈ కాజ్‌వే దాదాపు రెండు దశాబ్దాలుగా కేవలం ప్రతిపాదనలకే పరిమితమై ఉండగా ఇప్పుడు ఎమ్మెల్యే ప్రసన్న కృషితో అది ఫలవంతం కానుండడంతో ఈ ప్రాంత వాసుల చిరకాల స్వప్నం నెరవేరబోతోంది.

### కాజ్‌వే వల్ల ఎంతో ఉపయోగం

సుమారు 1600 మీటర్ల ఈ కాజ్‌వేను సముద్రపు నీరు, పెన్నానది నీరు కలవకుండా నిర్మించాలని భావిస్తున్నారు. ఈ నిర్మాణం పూర్తయితే తీరప్రాంతంలోని అనేక గ్రామాల్లో భూగర్భజలాలు ఉప్పు నీటిమయం కాకుండా పరిరక్షించుకోవడం జరుగుతుంది. ఇప్పటికే ఈ ప్రాంతాల్లోని భూగర్భజలాలు సముద్రపు నీటితో కలుషితమై ఆ ప్రభావంతో ఉప్పగా మారిపో తున్నాయి. పెన్నానది జలాలు ఇందుకూరుపేట మండలంలోని కుడితిపాళెం గ్రామం వద్ద సముద్రంలో కలుస్తాయి. ఈ జలాలు వృధా కాకుండా కనీసం కొంతమేరకైనా నిల్వచేసుకునేందుకు సముద్రానికి పది కిలోమీటర్ల దూరం ముందే ముదివర్తి– ముదివర్తిపాళెం మధ్య కాజ్‌వే నిర్మించడం వల్ల ఎంతో ప్రయోజనం ఉంటుంది. పెన్నా నీరు సముద్రంలో కలవకుండా ఉండడమే కాక, భూగర్భజలాల నీటి మట్టం కూడా పెరిగేందుకు వీలుంటుంది. ఈ కాజ్‌వే పూర్తయితే విడవలూరు, ఇందు కూరుపేట, కోవూరు, నెల్లూరు రూరల్ మండలాల్లోని దాదాపు 40 గ్రామాల ప్రజలకు తాగునీటితో పాటు సుమారు 10వేల ఎకరాలకు సాగునీరు కూడా లభించనున్నాయి. 93.32 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించ తలపెట్టిన ఈ కాజ్‌వే పనులకు ఈ నెలాఖారులోగానే టెండర్లు ఖరారై వచ్చే నెలలోనే పనులు కూడా ప్రారంభం కానుండడం ఈ ప్రాంత ప్రజలకు శుభవార్త.

ఇంత మంచి పథకానికి ఆమోదం తెలిపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, కాజ్‌వే నిర్మాణానికి విశేష కృషి చేస్తున్న ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి ఈ ప్రాంతప్రజలు మనసారా కృతజ్ఞతలు చెప్తున్నారు.



# పాపం!.. దివ్యశ్రీ

● బాలిక మృతితో.. బాధపడ్డ ఉపరాష్ట్రపతి వెంకయ్య

*ఆ పాప ఆరోగ్యం కోసం తామెంతో తపనపడినా, ఆమె చికిత్సకోసం సహాయాన్ని అందించినా.. దురదృష్టవశాత్తూ ఆ బాలిక మరణించడంతో భారత ఉపరాష్ట్రపతి ఎంతో బాధను వ్యక్తం చేశారు. 'ఫాంకోని అనిమియాకు గురైన కుమారి దివ్యశ్రీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, తదితర దాతల ద్వారా శస్త్రచికిత్స కోసం సహాయాన్ని పొందినప్పటికీ, చికిత్స పొందుతూ ఆమె మృతి చెందడం పట్ల ఉపరాష్ట్రపతితో పాటు వారి కుటుంబం, దాతలు ఎంతగానో బాధపడుతూ విచారం వ్యక్తం చేశారు. దివ్యశ్రీ మృతి అందరినీ కలచివేసింది. వివరాలిలా ఉన్నాయి.*

నెల్లూరు జిల్లాకు చెందిన ఆర్టీసీ కండక్టర్ చెంచుకుమార్ కుమార్తె అయిన దివ్యశ్రీ ఎం.సి.ఏ. పూర్తిచేసింది. తరచూ ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న ఆమెను తమిళనాడులోని వెల్లూరు సి.ఎం.సి ఆసుపత్రికి తీసుకెళ్లగా బోన్ మ్యారో మార్పిడి శస్త్రచికిత్స అవసరమని, ఇందుకు 25 లక్షల వరకూ ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. ఈ విషయాన్ని తెలియచేస్తూ ఆమె తండ్రి ఉపరాష్ట్రపతి కార్యాలయానికి ఉత్తరం రాశారు. తక్షణం స్పందించిన ముప్పవరపు వెంకయ్యనాయుడు ఉపరాష్ట్రపతి కార్యాలయ సహాయనిధి నుంచి సహకారం అందించడమే కాక, ప్రధానమంత్రి సహాయనిధిని విడుదల చేయించేందుకు చొరవ తీసుకున్నారు. అంతేకాకుండా స్వర్ణభారత్ ట్రస్ట్, ఉపరాష్ట్రపతి కుటుంబసభ్యులు, మిత్రులు సైతం సహకారం అందించేందుకు ముందుకు వచ్చారు. రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి కూడా ఆ బాలిక శస్త్ర చికిత్సకు ఆర్థికసాయం అందించారు. ఉపరాష్ట్రపతి కుమార్తె దీపావెంకట్, వి.ఐ.టి కాలేజీ శ్రీ నారాయణి అమ్మ ట్రస్ట్ నిర్వాహకులతో మాట్లాడి దివ్యశ్రీ శస్త్రచికిత్సకు అవసరమైన ఇతర సహకారాన్ని అందించవలసిందిగా కోరగా వారు కూడా ముందుకు వచ్చారు. ఉపరాష్ట్రపతి స్వయంగా వైద్యులతో ఫోన్ ద్వారా మాట్లాడి శస్త్రచికిత్స వివరాలు అడిగి తెలుసుకున్నారు. మెరుగైన చికిత్స అందించాల్సిందిగా సూచించారు. సి.ఎం.సి. వైద్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని శస్త్రచికిత్సను పూర్తిచేయడమే కాక, ఆమె ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పూర్తిస్థాయిలో పర్యవేక్షిస్తూ వచ్చారు. రెండు వారాల క్రితం ఉపరాష్ట్రపతి కుమార్తె శ్రీమతి దీపావెంకట్ స్వయంగా వెల్లూరు వెళ్లి దివ్యశ్రీ ఆరోగ్య పరిస్థితి గురించి విచారించి, ఆమె ఆరోగ్య పరిస్థితి మెరుగుపడుతోందని క్రమంగా కలుకుంటోందని ఉపరాష్ట్రపతికి ఫోన్‌ద్వారా తెలియచేశారు. శస్త్ర చికిత్స పూర్తై కోలుకుంటోందని ఆశిస్తున్న తరుణంలో దివ్యశ్రీ మృతి చెందడం పట్ల ఉపరాష్ట్రపతితో పాటు వారి కుటుంబ సభ్యులు తీవ్ర విచారం వ్యక్తంచేశారు. ఆమె ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ దివ్యశ్రీ తల్లిదండ్రులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియచేశారు.

## వేసవిలో.. జాగ్రత్తలు తీసుకోవాలి

వేసవి కాలం వస్తున్న దృష్ట్యా జిల్లాలోని చిన్నారులు, గర్భిణిలు, వృద్ధులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఆరోగ్య పరంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి రాజ్యలక్ష్మి చెప్పారు. సాధ్యమైనంతవరకు ఎండలో తిరగకుండా ప్రజలు తమ పనులు చేసుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని పిహెచ్‌సీలలో వైద్యారోగ్య సిబ్బంది అందరికీ అందుబాటులో ఉన్నారని తెలిపారు.

## మార్చి 22న డిసిఎంఎస్ సమావేశం

నెల్లూరు జిల్లా కోఆపరేటివ్ సొసైటీ మహాజన సమావేశం ఈనెల 22న డిసిసి బ్యాంక్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు డిసిఎంఎస్ బిజినెస్ మేనేజర్ వెంకటస్వామి ఈనెల 17న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిసిఎంఎస్ పర్సన్ ఇన్‌చార్జి, జాయింట్ కలెక్టర్ హరేంద్రప్రసాద్ ఈ సమావేశానికి అధ్యక్షత వహిస్తారని తెలిపారు.


శ్రీరస్తు! శ్రీ రంగనాథ పరబ్రహ్మణే నమః శ్రీమతే రామానుజాయ నమః శుభమస్తు!!

శ్రీ తల్పగిరి రంగనాథస్వామి వారి దేవస్థానము

రంగనాయకులపేట, నెల్లూరు. ఫోన్ : 2331156.



బ్రహ్మోత్సవ ఆహ్వానము

తేది. 23-03-2021 నుండి
తేది. 02-04-2021 వరకు

| | | | |
|---|---|---|---|
| 23-03-2021 | మంగళవారం | సా॥ 6.15 గంటలకు | అంకురార్పణ |
| 24-03-2021 | బుధవారం | ఉ॥ 6.15 గంటలకు | ధ్వజారోహణము(తిరుచ్చి) |
| | | రా॥ 7.00 గంటలకు | శేషవాహనము |
| 25-03-2021 | గురువారం | ఉ॥ 8.00 గంటలకు | సూర్యప్రభ |
| | | రా॥ 7.00 గంటలకు | హంసవాహనము |
| 26-03-2021 | శుక్రవారం | ఉ॥ 8.00 గంటలకు | సింహవాహనము |
| | | రా॥ 7.00 గంటలకు | చంద్రప్రభ |
| 27-03-2021 | శనివారం | ఉ॥ 8.00 గంటలకు | పల్లకి (వెణ్ణత్తాళి) |
| | | రా॥ 8.00 గంటలకు | హనుమంతసేవ |
| 28-03-2021 | ఆదివారం | ఉ॥ 8.00 గంటలకు | మోహినీ అవతారము |
| | | రా॥ 8.00 గంటలకు | బంగారు గరుడసేవ |
| | | సా॥ 4.00 గంటలకు | పూలంగిసేవ |
| 29-03-2021 | సోమవారం | సా॥ 4.00 గంటలకు | పూలంగిసేవ |
| | | సా॥ 6.00 గంటలకు | కళ్యాణోత్సవం |
| | | రా॥ 1.00 గంటలకు | గజవాహనసేవ |
| 30-03-2021 | మంగళవారం | ఉ॥ 8.30 గంటలకు | రథోత్సవము (తిరుత్తేరు) |
| | | రా॥ 7.00 గంటలకు | పొన్న వాహనోత్సవము |
| 31-03-2021 | బుధవారం | మ॥ 2.00 గంటలకు | తిరుప్పాయ్‌న్దాడల్ |
| | | రా॥ 7.00 గంటలకు | అశ్వవాహనము |
| 01-04-2021 | గురువారం | ఉ॥ 8.00 గంటలకు | ప్రణయ కలహోత్సవము, చక్రస్నానం |
| | | సా॥ 6.00 గంటలకు | పుణ్యకోటి విమానము |
| 02-04-2021 | శుక్రవారం | సా॥ 6.00 గంటలకు | పుష్పయాగము |
| | | రా॥ 8.00 గంటలకు | దవనోత్సవము |
| | | రా॥ 10.00 గంటలకు | ధ్వజావరోహణము |
| 03-04-2021 | శనివారం | రా॥ 7.00 గంటలకు | తెప్పోత్సవము |

- డబ్బుగుంట వెంకటేశ్వర్లు, కార్యనిర్వహణాధికారి

## 'ప్రభా'తం

*'ఈ గొప్ప విజయం ప్రజలది. నామీద మీరు పెట్టిన నమ్మకం..మీ పట్ల నా బాధ్యతను మరింత పెంచింది. మీ కుటుంబంలో ఒకరిగా మీకింకా మంచి చేసేందుకు మరింతగా తాపత్రయపడతా. దేవుని దయతో.. మీ అందరి ఆశీస్సులతోనే ఈ చరిత్రాత్మక విజయం సాధ్యమైంది'*

**- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.**

# నమ్మకమే గెలిపించింది



**రాష్ట్రంలో జరిగిన స్థానిక ఎన్నికల్లో వైకాపాకే ప్రజలు బ్రహ్మరథం పట్టారు. దాదాపు అన్ని పంచాయతీల్లోనూ వైకాపాకే ప్రజలు జైకొట్టారు. 75 పురపాలక సంస్థలు, నగర పంచాయతీల్లో 73 మునిసిపాలిటీలు, 11 కార్పొరేషన్‌లలో వైకాపా విజయం చరిత్రాత్మకం. ముఖ్యమంత్రి జగన్ నమ్మకమైన.. పారదర్శక పాలనకు ఈ ఫలితాలే నిదర్శనం. ఈ విజయంతో మూడు రాజధానుల నిర్ణయానికి కూడా రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల మద్దతు వచ్చినట్లయింది. అంతేకాదు, చిత్తశుద్ధితో మంచి పాలన అందిస్తే ప్రజలు ఆ పార్టీని మరచిపోరని మరోసారి రుజువైనట్లయింది.**

చూడండి ఎంత వినమ్రతో!..ఇప్పుడే కాదు..ఎప్పుడూ ఇంతే. ఎంత గర్వకారణమైన విజయాన్ని సాధించినా ఆయనలో ఏమాత్రం గర్వం కనిపించదు. కష్టాలున్నప్పుడూ..లేనప్పుడూ కూడా..ఎప్పుడూ అదే చెరగని చిరునవ్వు. ప్రజల పట్ల అదే విధేయత!..అన్నిటికీ మించి ప్రజల పట్ల ఆయనకున్న నమ్మకం అపారమైనది..అపూర్వమైనది. ఒక్కమాటలో చెప్పాలంటే..జగన్ అంటేనే ఒక నమ్మకం..జగన్ అంటేనే ఒక విశ్వాసం అనేమాట ప్రజల్లో బాగా నాటుకుపోయింది. అంతగా ప్రజల మనసుల్లో నిలిచిపోయారాయన. ప్రజలంటే ఆయనకెంత నమ్మకమో.. ప్రజలకు కూడా ఆయనంటే అంత నమ్మకం. సరిగ్గా ఆ నమ్మకమే ఆయన్ను విజయశిఖరాలపై నిలబెడుతోంది. ఆ నమ్మకమే.. తాజాగా జరిగిన స్థానిక ఎన్నికల్లోనూ వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీకి అఖండ విజయం సాధించి పెట్టింది. దివంగత మహానేత రాజన్న బిడ్డగా మాట తప్పకుండా, మడమ తిప్పకుండా ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలన్నిటినీ చెప్పినవి చెప్పినట్లుగా చేస్తూ.. ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకుంటున్నారు యువనేత.. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి. అందుకే జగనంటే ప్రజలకు అంత అభిమానం. అదేవిధంగా జగన్‌కు కూడా ప్రజలంటే ఎంతో అభిమానం. ఆ అభిమానమే ప్రజలకు సంక్షేమ పథకాల రూపంలో వెల్లువెత్తుతోంది.

రాష్ట్రంలో జగన్ సారధ్యంలో వైకాపా అధికారంలోకి వచ్చి రెండేళ్ళు పూర్తిచేసుకోబోతున్న తరుణంలో ఇటీవల జరిగిన మునిసిపల్ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పట్టారంటే అందుకు ప్రధాన కారణం ప్రజలకు ప్రభుత్వం పైనా, ముఖ్యమంత్రి పైనా ఉన్న అపూర్వమైన విశ్వాసానికి నిదర్శనం. రాష్ట్రంలోని దాదాపు అన్ని పంచాయతీల్లోనూ వైకాపాకే ప్రజలు జైకొట్టారు. ఎన్నికలు జరిగిన 75 పురపాలక సంస్థలు, నగర పంచాయతీల్లో ఏకంగా 73 మునిసిపాలిటీలు, 11 మునిసిపల్ కార్పొరేషన్‌లలో వైకాపా విజయం సాధించడమంటే మాటలు కాదు. అలాంటి అసాధ్యాన్ని సైతం సుసాధ్యం చేసుకుంది వైకాపా. ఒకవైపు ఆర్థిక సంక్షోభం, మరోవైపు కరోనా ప్రభావంతో పాటు అనేకరకాలైన సమస్యలు రాష్ట్రాన్ని అతలాకుతలం చేస్తున్న పరిస్థితుల్లో కూడా ఎంతో సంయమనంతో ఆ సవాళ్ళన్నింటినీ ఎదుర్కొంటూనే.. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా జరిగిన ఈ ఎన్నికల్లో వైకాపా అఖండ విజయం సాధించడం ఎంతో చరిత్రాత్మకం. అంతేకాదు, రాజధాని అమరావతి, విశాఖ ఉక్కు వంటి కీలకమైన అంశాలున్న ప్రాంతాల్లోకూడా వైకాపాయే ఘనవిజయం సాధించింది. వైకాపా ధాటికి పదిచోట్ల అసలు ప్రతిపక్షమే లేకుండా పోయింది. ఫ్యాన్‌గాలి దెబ్బకు సైకిల్ చతికిలపడిపోయింది. ప్రజలను నిర్లక్ష్యం చేయకుండా.. ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటూ.. సుపరిపాలనను అందిస్తే ప్రజలెంతగా అభిమానిస్తారో.. ఈ ఎన్నికల ఫలితాలు మనకు స్పష్టంగా వెల్లడిస్తున్నాయి. బహుశా..వైకాపా విజయరహస్యం అదే కాబోలు!.. రాష్ట్రంలోని బడుగు బలహీనవర్గాల ప్రజలకు, పేదలకు, అన్ని వర్గాల ప్రజానీకానికి, పార్టీలకు అతీతంగా జగన్ చేపట్టినన్ని సంక్షేమ పథకాలు దేశంలోనే ఇంకెవరూ చేపట్టలేదు.. చేపట్టలేరన్నది కూడా జనమంతా అనుకుంటున్న మాటే. అందులోనూ మనరాష్ట్రంలో ఇన్ని రకాల సంక్షేమ పథకాలు ఎప్పుడైనా విన్నామా కన్నామా?.. ప్రభుత్వ పథకాలంటే ఎవరో కొంతమంది అయినవాళ్ళకేనన్న నానుడికి భిన్నంగా.. జగన్ సారధ్యంలో వైకాపా వచ్చాక రాష్ట్రంలో ప్రజలందరికీ, ముఖ్యంగా బడుగు బలహీనవర్గాలవారందరికీ ఏదోఒకవిధంగా మేలుచేయాలనే తపనతో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలందరి గుండెలను హత్తుకుంటున్నాయి. పేదప్రజలకు ఇళ్ళు, ఇళ్ళస్థలాలు, వారి బిడ్డల చదువులకు, తల్లిదండ్రులకు ఆర్థిక చేయూత, ఇలా అన్ని వర్గాల ప్రజలకు ఎన్నో రకాల సంక్షేమ పథకాలతోపాటు..మరోవైపు రాష్ట్రంలో లక్షల కోట్ల రూపాయలతో చేస్తున్న ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు.. అన్నిటినీ ప్రజలు చూస్తూనే ఉన్నారు. అదే విధంగా సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల వ్యవస్థ వంటి పాలనా పరమైన సరికొత్త విధానాలతో పారదర్శకంగా పాలన చేస్తుండడాన్ని కూడా నిత్యం ప్రజలంతా గమనిస్తూనే ఉన్నారు. ఖజానాలో నిధులున్నా లేకున్నా.. పేదల కోసం ఇలా.. ఎన్నో రకాల పథకాలు ప్రవేశపెడు తుండడం అపూర్వం.. అమోఘం!.. జనం బాగుకోసం జగన్ పడుతున్న శ్రమనంతా రాష్ట్ర ప్రజలు అర్థం చేసుకుంటూనే ఉన్నారు. వాటి ఫలితమే ఈ అపూర్వ విజయం. ప్రజల కోసం ఏదైనా సరే చేయాల్సిందేనన్న పట్టుదల గలిగిన ఏకైక నాయకుడు యువనేత జగన్ ఒక్కరే అని ప్రజలంతా గట్టిగా విశ్వసిస్తున్నారు. ప్రజలెప్పుడూ తనవెంట ఉంటారని జగన్ కూడా నమ్ముతున్నారు. ప్రజానేతకు.. ప్రజలకు మధ్య తరగని అభిమానం ఉంటే ఇక విజయాలు ఎక్కడికి పోతాయి?.. ఎలాంటి ఘన విజయాలైనా సరే.. వాటంతటవే వచ్చి వాలిపోతాయి. ఇప్పుడు జరిగిందిదే. ఈ ఎన్నికల్లో ప్రత్యర్థి తెలుగుదేశం పార్టీ పూర్తిగా తుడిచిపెట్టుకుపోవడం 'ఫ్యాను' గాలి ధాటికి 'సైకిల్' చతికిలబడిపోవడం ఆ పార్టీకి ఘోర పరాభవమేనని ప్రత్యేకించి వేరే చెప్పనక్కర లేదు. వైకాపా విజయంతో మూడు రాజధానుల నిర్ణయానికి రాష్ట్రవ్యాప్తంగా ప్రజల మద్దతు వచ్చినట్లయింది. ముఖ్యమంత్రి జగన్ నమ్మకమైన..పారదర్శక పాలనకు ఇది తాజా నిదర్శనం. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా మంచి పాలన అందిస్తే ప్రజలు ఆ పార్టీని, ఆ నేతలను ఎప్పటికీ మరచిపోరన్నది ఈ విజయం ద్వారా మరోసారి రుజువైంది.

# రంగనాథస్వామి తిరునాళ్ళ 23 నుండి

## 28న బంగారు గరుడసేవ, 29న కళ్యాణోత్సవం, 30న రథోత్సవం

***ఉత్తర శ్రీరంగంగా ప్రసిద్ధి చెందిన నెల్లూరు రంగనాథస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలకు భారీ ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. మార్చి 23వ తేది అంకురార్పణతో ప్రారంభమయ్యే ఈ బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 3వ తేది వరకు అంగరంగ వైభవంగా జరుగనున్నాయి. నెల్లూరు నగరమంతా భక్తజన సందోహంతో నిండిపోయే ఉత్సవాలివి. ఈ బ్రహ్మోత్సవాలలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అటు అధికారులు, ఇటు ఆలయ నిర్వాహకులు అందరూ కలసి పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు.***

ఎంతో విఖ్యాతమైన, ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన నెల్లూరు రంగనాయకులపేటలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలకు ఆలయ నిర్వాహకులు పెద్దఎత్తున ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. అధికారులు, ఆలయ నిర్వాహకులు ఈ ఏర్పాట్లలో తలమునకలై ఉన్నారు. మార్చి 23వ తేది మంగళవారం సాయంత్రం 6.15 గంటలకు బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరుగుతుంది. 24వ తేది నుంచి స్వామివారికి, అమ్మవార్లకు కన్నులపండువగా వాహన సేవలు ప్రారంభమవుతాయి. 24వ తేది ఉదయం 6.15 గంటలకు ధ్వజారోహణం (తిరుచ్చి), అనంతరం రాత్రి 7 గంటలకు శేషవాహనోత్సవం వైభవంగా నిర్వహిస్తారు. అదేవిధంగా 25వ తేది ఉదయం 8 గంటలకు సూర్యప్రభ వాహనం, రాత్రి 7 గంటలకు హంస వాహనం, 26వ తేది ఉదయం 8 గంటలకు సింహవాహనం, రాత్రి 7 గంటలకు చంద్రప్రభ వాహనం, 27వ తేది ఉదయం 8 గంటలకు పల్లకి ఉత్సవం, రాత్రి 8 గంటలకు హనుమంతసేవ, 28వ తేది ఉదయం 8 గంటలకు మోహిని



అవతారం, రాత్రి 8 గంటలకు బంగారు గరుడసేవ ఉత్సవం, అనంతరం సాయంత్రం 4 గంటలకు పూలంగిసేవ జరుగుతాయి. ఇదే రోజున శ్రీకృష్ణ చరిత మానస ప్రచారమండలి ఆధ్వర్యంలో నెల్లూరులోని మైపాడు గేటు దగ్గరున్న ఆంజనేయస్వామి గుడివద్ద నుంచి రంగనాథస్వామి దేవాలయం దాకా నూతన శ్వేత ఛత్రాల ఊరేగింపు ఉంటుంది. 29వ తేది సాయంత్రం 4 గంటలకు స్వామివారికి, అమ్మవార్లకు పూలంగిసేవ, సాయంత్రం 6గంటలకు కమనీయంగా స్వామివార్ల కళ్యాణోత్సవం జరుగుతాయి. ఆ తర్వాత రాత్రి 1 గంట ప్రాంతంలో గజవాహనోత్సవం ఉంటుంది. 30వ తేది రథోత్సవం. ఉదయం 8.30 నుంచి రథాన్ని పుష్పాలతో అలంకరిస్తారు. శ్రీస్వామివారికి, అమ్మవార్లకు మరింత శోభాయమానంగా పుష్పాలంకరణ చేస్తారు. రథోత్సవానికి రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి డాక్టర్ అనిల్ శ్రీస్వామి వారికి పట్టువస్త్రాలను సమర్పిస్తారు. ఈ వేడుకల్లో భాగంగా శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారికి పుష్పాలంకారం నిర్వహిస్తారు. రాత్రి 7 గంటలకు పొన్న వాహనోత్సవం ఉంటుంది. 31వ తేది మధ్యాహ్నం 2 గంటలకు తిరుప్పావ్‌న్దాల్ ఉత్సవం, రాత్రి 7 గంటలకు అశ్వ వాహనోత్సవం ఉంటాయి. ఏప్రిల్ 1వ తేది ఉదయం 8 గంటలకు ప్రణయ కలహోత్సవం (ముసుగుల సేవ), చక్రస్నానం, సాయంత్రం 6 గంటలకు పుణ్యకోటి విమానం ఉత్సవాలు కనువిందుగా ఉంటాయి. 2వ తేది సాయంత్రం 6 గంటలకు పుష్పయాగం, రాత్రి 8 గంటలకు దవనోత్సవం, రాత్రి 10 గంటలకు ధ్వజావరోహణోత్సవం నిర్వహిస్తారు. ఏప్రిల్ 3వ తేది రాత్రి 7 గంటలకు తెప్పోత్సవం వైభవంగా ఉంటుంది.

ఈ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 24 నుంచి 28వ తేది వరకు ప్రతిరోజు సాయంత్రం 5.30 గంటల నుంచి 6.30 దాకా స్వామివార్లకు ఏకాంత సేవ, ఊంజల్‌సేవలు నిర్వహిస్తామని ఆలయ ఇఓ డబ్బుగుంట వెంకటేశ్వర్లు తెలిపారు. అదేవిధంగా ప్రతి ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు స్వామివారికి పూలంగిసేవ అత్యంత వైభవంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులందరూ తప్పనిసరిగా కోవిడ్ నిబంధనలు పాటించి మాస్కులు ధరించాలని ఆయన కోరారు.

### దివ్యాంగులకు ఇళ్ల స్థలాలివ్వాలి

ప్రభుత్వం దివ్యాంగులకు నివేశన స్థలాలను కేటాయించాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి నాయకుడు పి.సుబ్రహ్మణ్యం కోరారు. ఈ విషయమై విడవలూరులో డిప్యూటీ తహశీల్దార్‌కు, ఎంపిడిఓ చిరంజీవికి ఈనెల 15వ తేదీన వినతి పత్రం ఇచ్చారు. దివ్యాంగుల హక్కుల పోరాట సమితి సభ్యులు బి.సుబ్రహ్మణ్యం, వెంకట రమణయ్య, శ్రీనివాసులు, కుమార్, పోలయ్య, కామాక్షి తదితరులు పాల్గొన్నారు.




lawyerpatrika@gmail.com
WhatsApp +91 98663 14741

### మమ్మల్ని ఆదుకోండి

జిల్లాలోని అనేక గ్రామాల్లో పండుగల రోజుల్లో, శుభకార్యాలలో దేవాలయాల ముంగిట భగవంతుని పట్ల అపారమైన భక్తితో భజనలు చేసుకుంటూ అదే జీవనాధారంగా ఉండే భజన కళాకారులు ఎందరో ఉన్నారు. అయితే రాను రాను మాకు ఆదరణ తగ్గిపోతోంది. ఎవ్వరూ మా బాధలను పట్టించుకోవడం లేదు. దీంతో జీవనోపాధికి కష్టమై మేము, మా కుటుంబాలు నిత్యం అనేక సమస్యలతో బాధపడుతున్నాము. అనేకమంది పస్తులు కూడా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. గ్రామాల్లో వీళ్ళ తరబడిగా భక్తి గీతాలు పాడుకుంటూ భజనలు చేసుకుంటూ అందరికీ పరిచయమైన మేము, మా కుటుంబాలు ఇతరత్రా ఎలాంటి వృత్తులను చేపట్టలేక పోతున్నాము. ఆధ్యాత్మిక భక్తి ప్రపత్తులను ప్రజల్లో పెంపొందించాలన్న మా పూర్వీకుల ఆశయాలతో తరతరాలుగా అనేక మందిమి భజన కళాకారులుగానే ఉంటూ గత కొంతకాలంగా కరోనా ప్రభావంతో వీధుల్లో, గ్రామాల్లో సామూహికంగా భజనలు, ప్రార్థనలు చేసే పరిస్థితి లేక మా జీవితాలు అన్ని విధాలుగా దయనీయంగా ఉంటున్నాయి. ప్రభుత్వం దయతలచి నిరుపేదలైన భజన కళాకారులందరికీ తగు చేయూత నందించాలని, పింఛన్లు, రేషన్‌కార్డులు వగైరాలు అందించి మమ్మల్ని ఆదుకోవాలని కోరుకుంటున్నాం.

**ఓ భజన కళాకారుడు, పొర్లపల్లి.**

# థ్యాంక్యూ.. సిఎం సార్!



తిరుపతి పార్లమెంటు ఉపఎన్నికకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా యువ ఫిజియోథెరపీ వైద్యుడు డాక్టర్ ఎం.గురుమూర్తిని పార్టీ అధిష్టానం ఖరారు చేసింది. బుధవారం ఉదయం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రిని కలిసిన డాక్టర్ గురుమూర్తి ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపాడు. తాను పార్లమెంటుకు పోటీ చేస్తానని కలలో కూడా ఊహించలేదని, తనకు ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి గారికి సదా రుణపడి ఉంటానని గురుమూర్తి అన్నాడు.

## సిఎం ప్రతిపాదనకు..

# కేంద్రం గ్రీన్‌సిగ్నల్

- కావలి-దుత్తలూరు రోడ్డు విస్తరణకు 451 కోట్లు

రాష్ట్రంలో పలు రోడ్ల విస్తరణకు సంబంధించి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పంపిన ప్రతిపాదనలకే కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో ఎంతోకాలంగా ఎవరూ పట్టించుకోని అతి ముఖ్యమైన కావలి-దుత్తలూరు రోడ్డు విస్తరణకు మార్గం సుగమమైంది. రాష్ట్రంలో హైవేల అభివృద్ధికి గత ఏడాది రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు ప్రతిపాదనలు పంపారు. ఇందులో ముఖ్యంగా రాష్ట్రంలోని అయిదు పోర్టులను అనుసంధానించేలా 400 కిలోమీటర్ల పొడవైన 25 రహదారులను విస్తరించాలని కోరారు. ఈ నేపథ్యంలో పోర్టులను అనుసంధానించే కావలి-దుత్తలూరు మధ్య 70 కిలోమీటర్ల రోడ్డును విస్తరించేందుకు రోడ్డు రవాణ, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ అమోదం తెలుపుతూ అందుకోసం 415కోట్ల రూపాయల నిధిని కూడా కేటాయించింది. రాయలసీమ జిల్లాలకు ఈ రోడ్డు అనుసంధానమయ్యేలా దీనిని విస్తరించాలని అనుకుంటున్నారు. కర్నాటకలోని రాంనగర్ నుంచి నెల్లూరుజిల్లాలోని కృష్ణపట్నం పోర్టుకు వెళ్ళే రహదారికి రెండవ మార్గంగా ఉన్న కావలి-ఉదయగిరి-సీతారామపురం మధ్య ఉన్న ఈ రెండులైన్ల రహదారిని మరింతగా అభివృద్ధి చేయనున్నారు. రామయపట్నం ఓడరేవు నిర్మాణం పూర్తయిన తర్వాత పెరిగే ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకుని నెల్లూరు, కడప, ప్రకాశం జిల్లాల మధ్య ఉన్న మార్గాలను కలిపేవిధంగా కావలి-దుత్తలూరు రోడ్డు విస్తరణ ఉపయోగపడుతుందని కూడా భావిస్తున్నారు.

# వాకర్స్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



నెల్లూరులోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో ఫ్రెండ్స్ వాకర్స్, స్టైల్ వాకర్స్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో ఈనెల 14న రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. రెడ్‌క్రాస్ వారి సహకారంతో ఏర్పాటైన ఈ శిబిరానికి వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ 203 యేకొల్లు రాఘవరెడ్డి, క్యాబినెట్ సెక్రటరీ నలుబోలు బలరామయ్యనాయుడు ప్రారంభోత్సవం చేయగా 108 మంది వాకర్స్ సభ్యులతో పాటు పలువురు క్రీడాకారులు, రక్తదాతలు పాల్గొని రక్తదానం చేశారు. మునిసిపల్ కమిషనర్ దినేష్‌కుమార్ ఈ శిబిరాన్ని సందర్శించారు. ఫ్రెండ్స్ వాకర్స్ అధ్యక్షుడు పలగాటి శ్రీనివాసులురెడ్డి, స్టైల్ వాకర్స్ అధ్యక్షుడు సోము భక్తవత్సలరెడ్డి, పి.వి కృష్ణారెడ్డి, వీరిశెట్టి హజరత్‌బాబుల పర్యవేక్షణలో అందరికీ అల్పాహారం పెట్టారు. వాకర్స్ వినుకొండ వెంకటేశ్వర్లు, మాగంటి ప్రసాద్, డి.జయరామనాయుడు, ఐ.సోను, కిలారి మధుసూదనరావు, ఎం.పిచ్చయ్య, ఎన్.బుజ్జయ్య, నిరంజన్, నారాయణరావు, రామానాయుడు, వెంకటేశ్వర్లు, జి.రాజగోపాలరెడ్డి, ఎస్‌వి సత్యనారాయణ పాల్గొన్నారు.

## కలెక్టర్ చొరవతో..

# రిజర్వాయర్‌కు మోక్షం

## పడమటినాయుడుపల్లి రైతులకు ఊరట



*ఎట్టకేలకు ఎంతోకాలంగా పరిష్కారానికి నోచుకోని సమస్య జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు చొరవతో ఒక కొలిక్కి వచ్చింది. రైతులకు సమ్మతమైన పరిహారం లభించేందుకు వీలు కలగడమే కాక, సోమశిల ప్రాజెక్టుకు సంబంధించి ఆనం సంజీవరెడ్డి హైలెవల్ కెనాల్ ఫేజ్-1లో కలిసి ఉన్న పడమటినాయుడుపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణానికి కూడా దారి ఏర్పడింది. వివరాలిలా ఉన్నాయి.*

మర్రిపాడు మండలంలోని పడమటి నాయుడుపల్లిలో ఆ రిజర్వాయర్ నిర్మించాల్సి ఉన్నా దానికోసం భూములు కోల్పోతున్న రైతులు తమకు న్యాయమైన పరిహారంగా ఎంతిస్తారో స్పష్టం చేయకుండా తాత్సారం చేయడం వల్ల వారి భూములను ఇచ్చేందుకు రైతులు ఒప్పుకోలేదు. అందులోనూ అవి మంచి వ్యవసాయ భూములు. వాటిల్లో అరటి, బొప్పాయి, మిరప వగైరాల పంటలు వేసుకుంటూ రైతులు తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు. రిజర్వాయర్ కోసంగా ఆ భూములను తాము కోల్పోతే తమ కుటుంబాల గతేమిటని వారు ఆందోళన చెందేవారు. ఒకవేళ తమ భూములు ఇవ్వాలంటే తమ జీవనోపాధికి ఇబ్బందులు లేకుండా పునరావాస చట్టం ప్రకారం నీటిపారుదల ఉన్న భూములకు ఎకరాకు 10 లక్షలు, మెట్ట భూములకు ఎకరాలకు 8 లక్షలు ఇవ్వాలని రైతులు ఎప్పటినుంచో కోరుతున్నారు. అయితే, చాలాకాలంగా అధికారులు సరైన పరిహారాన్ని ప్రతిపాదించకపోవడంతో ఆ సమస్యకు పరిష్కారం దొరకలేదు. ఈ నేపథ్యంలో ఇటీవల జిల్లా కలెక్టర్ చక్రధర్ బాబు ఆ విషయం తెలుసుకుని పడమటి నాయుడుపల్లి రైతులను కలెక్టరేట్‌కు పిలిపించి పరిహారం విషయమై సుదీర్ఘంగా చర్చించారు. తెలుగుగంగ ప్రత్యేక కలెక్టర్ ఎస్‌వి నాగేశ్వరరావు, ఆత్మకూరు ఆర్‌డిఓ సువర్ణమ్మ, డెప్యూటీ కలెక్టర్ దాసు, ఎపిఆర్ ఎస్‌ఏ నాయకుడు అల్లంపాటి పెంచలరెడ్డి తదితరులంతా కూడా ఈ చర్చల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రైతుల సమస్యను ఆసాంతం విన్నారు. పరిహారం విషయమై ఏం చేయాలో రైతులతో సంప్రదించారు. అధికారులతోనూ మాట్లాడారు. చివరికి నీటిపారుదల కలిగిన భూములకు ఎకరాకు 8 లక్షల రూపాయలు, నీటిపారుదల లేని మెట్ట భూములకు ఎకరాకు 7 లక్షల రూపాయలు ఇచ్చేట్లుగా అంగీకారం కుదిరింది. రైతులు అందుకు సమ్మతించి ఒప్పందపు పత్రాల మీద సంతకాలు కూడా చేశారు. దీంతో ఎంతోకాలంగా నానుతూ ఉన్న ఈ జటిల సమస్య ఒక గాటిన పడినట్లయింది. పడమటినాయుడుపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణానికి ఉన్న ప్రధాన సమస్య తొలగిపోయినట్లయింది.

# పర్యాటక అభివృద్ధికి నిధులిస్తాం

## - నెల్లూరు ఎంపి ఆదాలకు లోక్‌సభలో సమాధానం



ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటక రంగం అభివృద్ధికి అవసరమైన నిధులను వీలైనంత త్వరగా కేటాయిస్తామని కేంద్ర పర్యాటక అభివృద్ధిశాఖ మంత్రి ప్రహ్లాద్‌సింగ్ పటేల్ తెలిపారు. ఏపిలో పర్యాటక అభివృద్ధికి కేంద్రప్రభుత్వం ఏమేరకు నిధులు ఇచ్చిందని నెల్లూరు ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఈనెల 15న లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు ఆయన రాతపూర్వకంగా సమాధానమిస్తూ దేశాన్ని పర్యాటక శాఖ పరంగా మరింతగా అభివృద్ధి చేసేందుకు 'ఇన్‌క్రెడిబుల్ ఇండియా' పేరుతో ప్రతిఏడాది ఆన్‌లైన్ ప్రచారాలను నిర్వహిస్తోందన్నారు. పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వాలకు అవసరమైన నిధులను కేంద్రం అందజేస్తోందని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇందుకు అవసరమైన కార్యక్రమాల కోసం పూర్తి వివరాలు సమర్పించగానే నిధులు వీలైనంత త్వరగా కేటాయిస్తామన్నారు. గతంలో ఆంధ్రప్రదేశ్‌కు 'ఫ్లెమింగో ఫెస్టివల్'కు 10 లక్షల రూపాయలు కేటాయించినట్లు ఆయన వివరించారు. పులికాట్ సరస్సు, ఉబ్బలమడుగు వాటర్‌ఫాల్స్, నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రాలకు 49.56 కోట్లను 2015-16లో కేటాయించినట్లు పేర్కొన్నారు.

## ఏపిలో వృద్ధులకు ఎంత సాయం అందించారు?

రాష్ట్రీయ వయోశ్రీ యోజన పథకం కింద దేశంలో, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లోని వృద్ధులకు ఏవిధంగా సాయం అందించారంటూ నెల్లూరు ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఈనెల 16న పార్లమెంట్‌లో ప్రశ్నించారు. ఈ పథకం కింద సీనియర్ సిటిజన్లకు వీల్‌ఛైర్లు, కళ్ళద్దాలు, చెవి మిషన్లు ఏమేరకు అందించారో ఆ వివరాలు తెలియజేయాలని కోరారు. అందుకు కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖల మంత్రి రతన్‌లాల్ కటారియా రాతపూర్వకంగా సమాధానమిస్తూ, దేశవ్యాప్తంగా రాష్ట్రీయ వయోశ్రీ యోజన పథకం కింద 175 శిబిరాలను నిర్వహించి, 1,64,888 మంది సీనియర్ సిటిజన్లకు లబ్ధి చేకూర్చడం జరిగిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 2017-18 సంవత్సరంలో రెండు శిబిరాలు నిర్వహించి 2,720 మంది సీనియర్ సిటిజన్లకు 109.93 లక్షల రూపాయల విలువైన పరికరాలు అందించి సహాయపడినట్లు పేర్కొన్నారు. 2018-19లో 3 శిబిరాలను నిర్వహించి 2,676 మంది వయోవృద్ధులకు 15675 లక్షల రూపాయల విలువజేసే పరికరాలను అందించి సాయపడినట్లు వివరించారు.

# కరోనా పట్ల అప్రమత్తంగా ఉండాలి

దేశంలోని వివిధ రాష్ట్రాల్లో కోవిడ్ కేసులు పెరుగుతున్నాయని, అందువల్ల జిల్లా ప్రజలు కూడా ఈ వైరస్ పట్ల చాలా అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు ఈనెల16న ఒక ప్రకటనలో హెచ్చరించారు. కరోనా వైరస్ పట్ల ప్రజలు నిర్లక్ష్యంగా ఉండకుండా కోవిడ్ నిబంధనలు పాటిస్తూ తప్పనిసరిగా అందరూ మాస్కులు ధరించాలని, చేతులు తరచూ సబ్బుతో లేదా శానిటైజర్లతో శుభ్రం చేసుకుంటుండాలని, భౌతికదూరం పాటిస్తుండాలని, ఏదైనా కార్యక్రమాలు జరుపుకునే సందర్భంలో వీలైనంత తక్కువ మంది ఉండేలా చూసుకోవాలని సూచించారు. ప్రతి ప్రభుత్వాసుపత్రిలో కోవిడ్ పరీక్షలు అందుబాటులో ఉన్నాయన్నారు. హెల్త్‌కేర్ వర్కర్లకు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎంతో మందికి వ్యాక్సినేషన్ వేయడం జరిగిందని, అదేవిధంగా ఫ్రంట్‌లైన్ వారియర్స్ కూడా టీకా వేయించుకుంటున్నారని కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు.

# జనసేన.. ఆవిర్భావ దినోత్సవం



జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈనెల 14న నెల్లూరులోని జనసేన నాయకుల ఆధ్వర్యంలో నగరంలోని 10వ డివిజన్‌లో వైద్యశిబిరం నిర్వహించి పేదలకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. నాయకుడు గునుకుల కిషోర్ మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జనసేన నాయకులు, జనసైనికులు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పార్టీపట్ల తమ అభిమానం చాటుతున్నారన్నారు. పార్టీ పార్లమెంటరీ ఇన్‌ఛార్జి చెన్నారెడ్డి మనుక్రాంత్ సూచనల మేరకు పార్టీని బలోపేతం చేసేందుకు తమవంతు కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన నగర నాయకుడు సుజయ్‌బాబు, శ్రీనివాసులురెడ్డి, ప్రసాద్, మధు, పూసల మల్లేశ్వరరావు, సుల్తాన్, మొయిన్ తదితరులు పాల్గొన్నారు.



# బ్రహ్మోత్సవాలకు పటిష్టమైన ఏర్పాట్లు

**- అధికారులతో మంత్రి అనిల్**

నెల్లూరులోని శ్రీ తల్పగిరి రంగనాథస్వామి దేవాలయంలో ఈనెల 23 నుంచి వచ్చేనెల 3వ తేది దాకా బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లన్నీ పటిష్టవంతంగా చేయాలని మంత్రి డాక్టర్ అనిల్‌కుమార్‌యాదవ్ అధికారులను ఆదేశించారు. ఈ ఏర్పాట్లకు సంబంధించి అధికారులతో ఆయన ఇటీవల సమీక్షా సమావేశం నిర్వహించారు. అధికారులు అందరూ సమన్వయంతో పనిచేసి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని చెప్పారు. కోవిడ్ నేపథ్యంలో భక్తులంతా నిబంధనలు పాటించాలని, మాస్కులు ధరించాలని సూచించారు. తొలుత బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్లను మంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు ఆర్డీఓ హుస్సేన్‌సాహెబ్, సహాయ కమిషనర్ శ్రీనివాసులురెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి వెంకటేశ్వర్లు, నగర డిఎస్పీ శ్రీనివాసులురెడ్డి, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులతో పాటు మాజీ డెప్యూటి మేయర్ ముక్కాల ద్వారకానాథ్, వైకాపా నాయకులు శ్రీరాం సురేష్, కొణిదెల సుధీర్, వందవాసి రంగా, వేలూరు మహేష్, రమేష్, నూనె మల్లికార్జునయాదవ్ తదితరులు పాల్గొన్నారు.


**రోలర్ స్కేటింగ్‌లో**

# 'విశ్వసాయి' విద్యార్థికి కాంస్య పతకం



ఇటీవల విశాఖలో జరిగిన అండర్-17 రోలర్ స్కేటింగ్ పోటీల్లో నెల్లూరు మాగుంట లేఅవుట్‌లో ఉన్న విశ్వసాయి కళాశాల విద్యార్థి ఎన్.నితిన్ కాంస్య పతకం సాధించాడు. నితిన్ జూనియర్ ఇంటర్‌లో ఎంపిసి చదువుతూ రోలర్ స్కేటింగ్‌లోనూ ప్రతిభతో రాణిస్తుండడం విశేషం. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మెన్ డా.ఎన్.సత్యనారాయణ, వైస్‌ఛైర్మెన్ జి.కృష్ణమోహన్‌లు ఆ విద్యార్థిని అభినందించారు. తమ కళాశాల విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ నైపుణ్యం ప్రదర్శిస్తుండడం ఎంతో సంతోషదాయకమని వారు పేర్కొన్నారు.

# గోపాలకృష్ణయ్యను పలుకరించిన సోమిరెడ్డి



మాజీమంత్రి, టిడిపి నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఇటీవల నెల్లూరులోని విజయ డెయిరీ ఛైర్మెన్ ముప్పవరపు గోపాలకృష్ణయ్య చౌదరిని కలుసుకుని ఆయన ఆరోగ్యపరిస్థితుల గురించి తెలుసుకున్నారు. వారి కుటుంబసభ్యులను కూడా సోమిరెడ్డి పలుకరించాడు. అదేవిధంగా ఇటీవల మాతృమూర్తిని కోల్పోయిన మాజీ కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస యాదవ్‌ను పరామర్శించి వారి కుటుంబసభ్యులను ఓదార్చారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, దశరథనాగేంద్రప్రసాద్ తదితరులున్నారు.

# దొరికిపోయిన పేకాటరాయుళ్ళు

నెల్లూరు వెంకటేశ్వరపురం వద్ద పెన్నానదిలో పేకాట ఆడుతున్న నవీన్‌కుమార్, రామారావు, వెంకటేశ్వర్లు, వెంకటేష్, రహీం, మధుసూదన్ రావు, ప్రసాద్‌లను ఈనెల 15న ఎస్ఇబి అధికారులు అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 1,18,750 రూపాయలు, 8 మోటార్‌బైక్‌లు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

## నెల్లూరు కబుర్లు

**అమరజీవి త్యాగం వల్లనే**

# ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం

**- శ్రీ పొట్టి శ్రీరాములుకు నివాళులర్పించిన కలెక్టర్**



అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం వల్లనే దేశంలోనే మొట్టమొదటి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఏర్పాటైందని, ఆ మహనీయుని త్యాగనిరతి అపూర్వమని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు అన్నారు. ఈనెల16న శ్రీ పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండ్ వద్ద ఉన్న శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం ప్రాణత్యాగం చేసిన శ్రీ పొట్టి శ్రీరాములు జయంతి ఉత్సవాలను రాష్ట్ర ఉత్సవాలుగా రాష్ట్రమంతటా జరుపుకోవడం తెలుగుప్రజలకు, ముఖ్యంగా నెల్లూరుజిల్లా వాసులకు గర్వకారణమన్నారు. ఆ మహనీయుని పేరుతో శ్రీ పొట్టి శ్రీరాములు జిల్లాగా నెల్లూరుజిల్లాకు నామకరణం జరిగిందని గుర్తుచేశారు. ప్రతి ఒక్కరూ తెలుగుభాషను నేర్చుకోవాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డిఓ హుస్సేన్‌సాహెబ్, శ్రీ పొట్టి శ్రీరాములు స్నేహితుడు చలమయ్య, అధికారులు పాల్గొన్నారు.

అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో శ్రీ పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి అధికారులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ చక్రధర్ బాబుతో పాటు ఎన్నికల పరిశీలకులు బసంత్‌కుమార్, జేసీలు ప్రభాకర్‌రెడ్డి, హరేందిరప్రసాద్, టి.బాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చిరస్మరణీయులు శ్రీ పొట్టి శ్రీరాములు

అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులని, ఆయన ప్రాణ త్యాగంతోనే ఆంధ్రప్రదేశ్ ప్రత్యేకరాష్ట్రంగా అవతరించిందని ఆర్యవైశ్య సంఘాల నాయకులు కొనియాడారు. శ్రీ పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఈనెల 16న నగరంలోని శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అర్బన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పేర్ల సీతారామారావు, నాయకులు సరాబు సుబ్రహ్మణ్యం, అమరా వెంకటేశ్వర్లు, చలువాది శరణ్, నున్నా రమేష్, పెంచలకుమార్, కొణిజేటి వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

## త్యాగధనుడు.. ఆ మహనీయుడు

**- సరస్వతీ సమాజం నివాళి**



భాషాప్రయుక్త రాష్ట్రాల వేగుచుక్క, నిరుపమాన, నిస్వార్థ త్యాగధనుడు అమరజీవి పొట్టిశ్రీరాములు 121వ జయంతి సభ ఈ నెల 16న నెల్లూరులోని శ్రీ అన్నదేవుల గోవిందురెడ్డి సరస్వతీ సమాజం ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విశ్రాంత సంయుక్తకార్యదర్శి పాటూరు బలరామిరెడ్డి, సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు మూలాపేటలోని శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. అనంతరం తూపిలి రవీంద్రబాబు రాసిన 'జెండాకర్ర' అనే గేయాన్ని సరస్వతీ సమాజం కార్యదర్శి టి.రమణయ్య చదివి వినిపించారు. తుమ్మల మోహనమ్మ స్వీట్లు, పెన్నులు పంచారు. బండ్ల రమణయ్య వందన సమర్పణ చేశారు.

# నిరాశ్రయులకు అన్నదానం

నెల్లూరులోని అమ్మ యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 15న ఆత్మకూరు బస్టాండ్, సంతపేట తదితర ప్రాంతాల్లోని నిరాశ్రయులకు అన్నదానం చేసి తమ సేవాభావం చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు రమేష్‌బాబు, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

**పథకాల అమలుపై...**

# జిల్లా అధికారులతో సిఎం సమీక్ష

కోవిడ్ వ్యాక్సినేషన్, పరిపాలన, అభివృద్ధి తదితర అంశాలపై రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 16న తాడేపల్లిలోని సిఎం క్యాంప్ కార్యాలయం నుంచి జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో జరుగుతున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల అమలు తీరును సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చక్రధర్ బాబు, జేసీలు హరేందిరప్రసాద్, ప్రభాకర్‌రెడ్డి, బాపిరెడ్డి, డిఆర్‌ఓ చిన్న ఓబులేసు, డిపిఓ ధనలక్ష్మి, ఏఎస్పీ వెంకటరత్నం పాల్గొన్నారు.

**అంధుల పాఠశాలకు**

# వసతులు ఏర్పాటు చేస్తాం

నెల్లూరులోని విశ్వభారతి అంధుల పాఠశాలకు అవసరమైన వసతులను ఏర్పాటు చేసేందుకు కృషిచేస్తామని నెల్లూరు ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. ఇటీవల ఆయన ఆ పాఠశాలను సందర్శించారు. కరెస్పాండెంట్ ప్రభావతితో మాట్లాడి పాఠశాలకు ఏఏ సౌకర్యాలు కావాలో అడిగి తెలుసుకున్నారు. విద్యాపరంగా అత్యవసరమైన సౌకర్యాల ఏర్పాటుకు తనవంతు కృషిచేస్తానన్నారు. ఈ విషయమై విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డితో కూడా చర్చించారు. మాజీ కార్పొరేటర్ స్వర్ణ వెంకయ్య, కోటేశ్వరరెడ్డి, పాముల హరి, నరసింహా రావు, అవినాష్, అల్లాబక్షు, ఇగ్బాల్, శ్రీనివాసరెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యాయురాలు రూప, నిర్వాహకులు రమణారెడ్డి పాల్గొన్నారు.

**పండ్ల తోటలకు**

# 7.56 కోట్లు

జిల్లాలో 2020-21 సంవత్సరానికి ఉద్యానతోటల పెంపకానికి 7.56 కోట్ల రూపాయలను జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు ఈనెల 15న మంజూరుచేశారు. పండ్ల తోటల విస్తరణ, హైబ్రిడ్ కూరగాయల సాగు, నీటికుంటల ఏర్పాటు తదితరాలకు ఈ నిధులను వినియోగించనున్నారు. ఉద్యానపంటలను సాగుచేసుకునే రైతులు సబ్సిడీ కోసం తమ పాసుపుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు పాసుపుస్తకం, రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రాల జెరాక్స్ కాపీలతో ఉద్యానశాఖ అధికారులను సంప్రదించాలని కలెక్టర్ పేర్కొన్నారు.

**ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ**

# బ్యాంకు ఉద్యోగుల సమ్మె

జాతీయ బ్యాంకుల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా ఈనెల 15, 16 తేదీల్లో జరిగిన బ్యాంకు ఉద్యోగుల సమ్మెలో నెల్లూరుకు చెందిన పలు జాతీయ బ్యాంకుల వద్ద అనేకమంది బ్యాంకు ఉద్యోగులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా ఆందోళన చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేయడం ద్వారా వేలకోట్ల నిధులను సమీకరించాలన్న కేంద్రప్రభుత్వ విధానాలు అర్థరహితమంటూ విమర్శించారు. బ్యాంకుల విలీనాన్ని వారు నిరసించారు.

# తపాలా క్రీడల్లో వినీత ప్రతిభ

తపాలా శాఖ ఇటీవల లక్నోలో నిర్వహించిన ఆలిండియా క్యారమ్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో నెల్లూరుజిల్లా కావలికి చెందిన హెడ్‌పోస్టాఫీస్ పీఏ విఆర్ వినీత విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా ఈనెల 15న వినీతను నెల్లూరులోని ప్రధాన తపాలా కార్యాలయంలో పోస్టల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు అభినందించి ఘనంగా సత్కరించారు.

# రాష్ట్రంలో ఫ్యాక్షన్ పాలన

**- బిజెపి నాయకుల విమర్శ**



రాష్ట్రంలో రౌడీరాజ్యం, ఫ్యాక్షన్ పాలన సాగుతోందంటూ బిజెపి నాయకులు ధ్వజమెత్తారు. ఈనెల 15న నెల్లూరులోని బిజెపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.సురేంద్రరెడ్డి మాట్లాడుతూ వైకాపా నాయకులు ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి ఎన్నికలను అపహాస్యం చేస్తున్నారని విమర్శించారు. బిజెపి నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు భరత్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం అమలుచేస్తున్న అనేక సంక్షేమ పథకాలకు రాష్ట్రప్రభుత్వం స్టిక్కర్లు మార్చి ఆ పథకాలు తమవేనన్నట్లుగా ప్రచారం చేసుకుంటోందని దుయ్యబట్టారు. ఈ సమావేశంలో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కాకు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# మహిళల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

## ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య



రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారధ్యంలోని ప్రభుత్వం మహిళల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నదని సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. ఈనెల 15న ఆయన నాయుడుపేట మునిసిపాలిటీ పరిధిలోని పొదుపు మహిళలకు మంజూరైన 23 లక్షల రూపాయల నగదుకు సంబంధించిన పత్రాలను వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవయ్య మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో ధీటుగా రాణించేందుకు సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలను ప్రవేశపెట్టారని చెప్పారు. గతంలో చంద్రబాబు పొదుపు మహిళలను మోసం చేసినందు వల్లనే వారు ఎన్నికల్లో బాబుకు గుణపాఠం చెప్పారని, ఇప్పుడు తమ నేత వైఎస్ జగన్ ఎన్నికలప్పుడు ప్రజలకు ఇచ్చిన అన్ని వాగ్దానాలను అమలుచేస్తూ ప్రజలందరి అభిమానం పొందుతున్నారని అన్నారు. అందుకే మహిళలంతా కలసి మునిసిపల్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపికి ఘన విజయం సాధించిపెట్టారని ఆయనందరి కరతాళధ్వనుల మధ్య పేర్కొన్నారు. మెప్మా టిఎంసి జయరాం, కమిషనర్ లింగారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపి నాయకులు రఫీ, కామిరెడ్డి రాజారెడ్డి, కటకం జయరామయ్య, పేర్నాటి రాహుల్ పాల్గొన్నారు.

## యూనివర్శిటీల సహకారంతో..

# త్వరలోనే జర్నలిజం సర్టిఫికెట్ కోర్సు

## ప్రెస్ అకాడమీ ఛైర్మెన్ శ్రీనాధ్



ప్రెస్ అకాడమీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో త్వరలోనే జర్నలిజం సర్టిఫికెట్ కోర్సు ప్రారంభిస్తామని అకాడమీ ఛైర్మెన్ దేవిరెడ్డి శ్రీనాధ్‌రెడ్డి చెప్పారు. ఈనెల 13న ఆయన నెల్లూరులోని విక్రమసింహపురి యూనివర్శిటీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనివర్శిటీల సహకారంతో రాష్ట్రంలోని జర్నలిస్టుల నైపుణ్యాలను పెంపొదించేందుకు కృషిచేయాలని భావిస్తున్నామన్నారు. యూనివర్శిటీల్లో జర్నలిజం కోర్సుల్లో వర్కింగ్ జర్నలిస్టులు అడ్మిషన్ తీసుకుంటే ఫీజులో కొంతభాగాన్ని అకాడమీ భరిస్తుందన్నారు. ఈ విషయమై ఇప్పటికే నెల్లూరులోని విక్రమసింహపురి యూనివర్శిటీ, కడపలోని యోగి వేమన యూనివర్శిటీ, తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయాలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నామన్నారు. మిగిలిన యూనివర్శిటీలతో కూడా ఈ ఒప్పందాలు చేసుకుంటామని తెలిపారు. యూనివర్శిటీల సహకారంతో జర్నలిస్టులకు నైపుణ్యాలు పెరిగితే తద్వారా సమాజానికి మేలు జరుగుతుందన్నారు. జర్నలిజంలో సర్టిఫికెట్ కోర్సును నెల్లూరులోని విక్రమసింహపురి యూనివర్శిటీతో కలిసి నిర్వహించాలని భావిస్తున్నామని, ఆ మేరకు కృషి జరుగుతోందని చెప్పారు. అందుకు విధివిధానాలు రూపొందించాల్సిందిగా యూనివర్శిటీ రిజిస్ట్రార్ డా.ఎల్ విజయకృష్ణారెడ్డి, పద్మావతి మహిళా యూనివర్శిటీ జర్నలిజం శాఖ ఆచార్యులు విజయలక్ష్మిని కోరామని చెప్పారు. అనంతరం ప్రెస్ అకాడమీ ఛైర్మెన్ దేవిరెడ్డి శ్రీనాధ్‌రెడ్డి దంపతులను యూనివర్శిటీ అధికారులు, అధ్యాపకులు ఘనంగా సత్కరించారు. యూనివర్శిటీ వీసీ చంద్రయ్య, రిజిస్ట్రార్ ఎల్ విజయకృష్ణారెడ్డి, డీన్ అందె ప్రసాద్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ విజయ, పరీక్షల నిర్వహణ అధికారి డాక్టర్ సాయిప్రసాద్‌రెడ్డి, డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ మణికంఠ, డాక్టర్ విజేత తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరామకృష్ణుని బోధనలు ఆదర్శప్రాయం

శ్రీరామకృష్ణ పరమహంస బోధనలు ఆదర్శప్రాయమని ఇందుకూరుపేట కొత్తూరులోని శ్రీ లలితా మహేశ్వరి ఆశ్రమాధిపతి శ్రీ మహేశ్‌స్వామి అన్నారు. నెల్లూరు నవలాకులతోట మూడోమైలు వద్ద శ్రీరామకృష్ణ సేవాశ్రమంలో ఈనెల 15న శ్రీ రామకృష్ణ పరమహంస 186వ జయంతి సభలో ఆయన ప్రసంగించారు. తొలుత మాచవోలు శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో విశేషహోమం జరిగింది. ప్రముఖ గాయకులు జి.జయచంద్ర భక్తి గీతాలాపన చేశారు. ఆశ్రమాధిపతి పూర్ణానందస్వామి ఆశీస్సులతో కె.శ్రీధర్, అగస్త్యరాజు సుబ్బారావు, ఎ.మాల్యాద్రి మహేశ్‌స్వామిని సన్మానించారు. పి.మురళి, నాగిరెడ్డి, పి.సాయిరవి, జి.వి. శేషారెడ్డి, ఆర్.వెంకటశేషయ్య తదితరులు పాల్గొన్నారు.

## వెంకటగిరిలో అన్ని స్థానాల్లో...

# వైకాపా గెలుపు.. ఓ చరిత్ర

## - ఎమ్మెల్యేలు ఆనం, కాకాణి



వెంకటగిరి మునిసిపల్ ఎన్నికల ఫలితాలు చరిత్రాత్మకమని, 25 స్థానాలకు 25 గెలుచుకోవడంతో వైకాపా ఇక్కడ ఘనమైన చరిత్ర సృష్టించిందని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారధ్యంలోని రాష్ట్ర ప్రభుత్వం పనితీరుకు, ముఖ్యంగా ముఖ్యమంత్రి జగన్‌పై ప్రజలకు ఉన్న విశ్వాసానికి ఈ విజయం ఒక నిదర్శనమని, ప్రతిపక్షాల లేనిపోని విమర్శలకు ఈ గెలుపే సరైన సమాధానమని వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డిలు చెప్పారు. ఈనెల 15న నెల్లూరులోని ఆనం రామనారాయణరెడ్డి నివాసంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. వెంకటగిరి మునిసిపాలిటీలో మొత్తం 25 కౌన్సిలర్ల స్థానాలుండగా, వీటిలో మూడు స్థానాల్లో ముందుగానే ఏకగ్రీవమయ్యా మని, మిగిలిన 22 స్థానాల్లో ప్రత్యక్ష ఎన్నికల్లో ప్రజాభిమానంతో విజయం సాధించామని చెప్పారు. జిల్లాకు చెందిన టిడిపి సీనియర్ నాయకుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వెంకటగిరిలో ప్రచారం చేసి తమపై రకరకాల ఆరోపణలు చేసినా ప్రజలు నమ్మలేదనేందుకు ఈ విజయమే ఒక తార్కాణమన్నారు. తామెక్కడా అధికార దుర్వినియోగం చేయకుండా, ప్రలోభాలు పెట్టకుండా ప్రజల మన్ననలతోనే విజయాన్ని సాధించామన్నారు. తమ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు వెంకటగిరి ప్రజలు ఈ విజయాన్ని బహుమతిగా ఇచ్చారని చెప్పారు. రానున్న రోజుల్లోనూ వైకాపా దినదినప్రవర్థమానమవుతుందే తప్ప వెనుకడుగు వేసే ప్రసక్తే లేదన్నారు. ఇంత ఘన విజయం సాధించిపెట్టిన వెంకటగిరి ప్రజలకు వారు తమ కృతజ్ఞతలు తెలిపారు. వెంకటగిరి ఎన్నికల్లో వైకాపా ప్రజాభిమానంతో క్లీన్‌స్వీప్ చేసిందంటూ ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మెట్టుకూరు ధనుంజయరెడ్డితో పాటు, వెంకటగిరిలో విజయం సాధించిన 25 మంది కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# శ్రీసిటీలో 'కనెక్ట్ టు ఆంధ్ర' సిఇఓ



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రణాళిక విభాగంలో పనిచేస్తున్న 'కనెక్ట్ టు ఆంధ్ర' సిఇఓ వి.కోటేశ్వరమ్మ ఈనెల 16న శ్రీసిటీని సందర్శించారు. అక్కడి పరిశ్రమల సీనియర్ అధికారులతో సమావేశమయ్యారు. రాష్ట్రంలోని వివిధ పరిశ్రమలు, సంస్థల కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) నిధులనుంచి విరాళాలను సేకరించి, రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు వినియోగించేలా చేపట్టిన కార్యక్రమం పర్యవేక్షణ కోసం 'కనెక్ట్ టు ఆంధ్ర' సంస్థ ఏర్పడిందని ఆమె ఈ సందర్భంగా చెప్పారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆమె వివరిస్తూ 'నాడు-నేడు' కార్యక్రమం ద్వారా తొలిదశలో 15వేలకిపైగా ప్రభుత్వ పాఠశాలల మౌలిక సదుపాయాలు మెరుగుపడ్డాయని తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ప్రభుత్వ పథకాలకు చేయూతగా సిఎస్ఆర్ నిధుల నుంచి భారీ విరాళాలు ఇవ్వడం ద్వారా శ్రీసిటీ పరిశ్రమలు చురుకైన పాత్ర పోషించాలని రాష్ట్ర ప్రభుత్వం ఎదురుచూస్తోందని చెప్పారు. ప్రభుత్వం అనేక ప్రాజెక్టులు ప్రారంభిస్తోందని, వాటిలో కంపెనీలు కొన్నిటిని ప్రత్యేకంగా ఎంపిక చేసుకుని సిటిఆర్ ద్వారా సిఎస్ఆర్ నిధులను విరాళంగా ఇచ్చి సరైన రీతిలో ఆ ప్రాజెక్టుల అమలుకు సహకరించాలని కోరారు. అన్ని పరిశ్రమలు 'కనెక్ట్ టు ఆంధ్ర' పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆమె కోరుతూ, రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రగా మార్చడంలో అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

## డిసిసిబి ద్వారా

# రైతులకు 36.13 కోట్ల రుణాలు

## - జేసీ హరేంధిరప్రసాద్

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డిసిసిబి) రైతులకు రుణాలిచ్చేందుకు సమాయత్తమైంది. జిల్లాలోని రైతులకు 2021-22 ఆర్థికసంవత్సరానికి 36.13 కోట్ల రూపాయల దాకా రుణాలు మంజూరు చేయనున్నామని డిసిసిబి పర్సన్ ఇన్‌చార్జి, జేసీ హరేంధిరప్రసాద్ చెప్పారు. ఈనెల 16న నెల్లూరులోని డిసిసిబిలో జరిగిన బ్యాంకు పాలకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా రైతాంగానికి కొత్తగా 8.53 కోట్లు, దీర్ఘకాలిక రుణాల కోసం 1.60 కోట్లు, రైతు వికాస్ పథకం కింద మరో 26కోట్ల రుణాలను మంజూరు చేసినట్లు తెలిపారు. బ్యాంకు సిఇఓ కె. వెంకటరమణారెడ్డి, డిసిఓ కె. తిరుపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఇతర రాష్ట్రాల్లోనూ..
# తెలుగును ప్రోత్సహించాలి



తెలుగేతర రాష్ట్రాల్లో కూడా తెలుగుభాష అభివృద్ధికి ప్రభుత్వాలు కృషిచేయాలని, ఇతర రాష్ట్రాల్లో ఉన్న తెలుగు ఉపాధ్యాయులను, తెలుగుభాషను నేర్పుతున్న సంస్థలను కూడా ప్రభుత్వం గుర్తించి ప్రోత్సహించాలని, అందుకు ప్రత్యేకంగా ఒక మంత్రిత్వశాఖ ఏర్పాటుచేస్తే బావుంటుందని అఖిలభారత తెలుగు సమాఖ్య ఛైర్మెన్, ప్రముఖ వైద్యులు సిఎంకె రెడ్డి సూచించారు. చెన్నైలో ఈనెల16న అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమం నిర్వహించి, అమరజీవి స్మారకభవనంలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ సిఎంకె రెడ్డి మాట్లాడుతూ శ్రీ పొట్టి శ్రీరాములు త్యాగం వల్లనే దేశంలో భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు జరిగిందని, ప్రత్యేకాంధ్ర రాష్ట్రం అవతరించిందని అన్నారు. ముఖ్యమంత్రి జగన్ సారథ్యంలోని ఆంధ్రప్రదేశ్‌లో ఆంధ్ర రాష్ట్ర అవతరణోత్సవాలను భారీగా జరుపుతుండడం సంతోషదాయకమన్నారు. తెలుగుభాష వికాసానికి అందరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య ప్రధాన కార్యదర్శి నందగోపాల్, నేలటూరు విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌బికెఆర్‌లో
# యోగా శిక్షణా తరగతులు



విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో మొదటి సంవత్సరం విద్యార్థులకు గత రెండు వారాలుగా యోగ శిక్షకులు కోటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యోగ శిక్షణా తరగతులు ఇటీవలే ముగిశాయి. ఎన్‌బికెఆర్ సంచాలకులు డాక్టర్ వి.విజయ కుమార్‌రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ యోగ శిక్షణతో ఆరోగ్యం పెంపొందుతుందని, విద్యార్థులు వారి జీవన సరళిని సన్మార్గంలో నడిపించేందుకు యోగ సాధన ఎంతో ఉపయోగ పడుతుందని చెప్పారు. అనంతరం కోటేశ్వరరెడ్డికి కళాశాల తరపున జ్ఞాపికను బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ వి.మల్లికార్జునరెడ్డి, అసిస్టెంట్ పీడీలు శోభారాణి, రాము కుమార్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్ వార్తలు

## అప్రోచ్‌రోడ్డు ఏర్పాటు చేస్తాం
**-సబ్ కలెక్టర్ గోపాలకృష్ణ**



గాంధీ నగర్ సమీపంలో కొత్తగా ఏర్పాటు చేసిన లేఅవుట్ నుంచి హైవే రోడ్డుకు అప్రోచ్‌రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని గూడూరు సబ్ కలెక్టర్ గోపాలకృష్ణ వెల్లడించారు. గూడూరు పట్టణ సమీపంలోని గాంధీనగర్ వద్ద ఇటీవల ఏర్పాటు చేసిన లేఅవుట్‌ను సబ్ కలెక్టర్ గోపాలకృష్ణ ఏపీఐఐసీ అధికారు లతో కలసి పరిశీలించారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ఏపీఐఐసికి గతంలో ఇక్కడ మూడు వందల ఎకరాల స్థలం ఇవ్వడం జరి గిందని లేఅవుట్‌లో నివాసం ఉండే ప్రజలకు సౌకర్యవంతంగా హైవే రోడ్డువరకు అప్రోచ్‌రోడ్డు నిర్మాణం కోసం కావలసిన భూమి గురించి ఏపీఐఐసీ అధికారులతో పరిశీలించామని తెలిపారు. గూడూరు, చిల్లకూరు తహశీల్దార్‌లు లీలారాణి, గీతావాణి, ఏపీ ఐఐసీ అధికారులు, సర్వేయర్లు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

## అమరజీవికి ఘననివాళులు

అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఈనెల 16న గూడూరు సబ్‌కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ, డిఎస్‌పి రాజ గోపాల్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు భాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం శ్రీ పొట్టి శ్రీరాములు చేసిన కృషిని కొనియాడారు.

## ప్రజల సొమ్ముకు జవాబుదారీ ఎవరు?



బ్యాంకులు ప్రైవేటీకరణ చేస్తే దేశ ఆర్థిక వ్యవస్థకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని, 150 లక్షల కోట్ల రూపాయలు బ్యాంకుల ఆధీనంలో ఉన్నాయని, ప్రైవేటీకరణ జరిగి దివాలా తీస్తే ప్రజల సొమ్ముకు ఎవరు బాధ్యత వహిస్తారని తిరుపతి మాజీ ఎంపీ చింతామోహన్ ప్రశ్నించారు. మంగళవారం గూడూరులో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై బీజేపీ కక్ష కట్టిందని, రాష్ట్రంలో ప్రజాస్వామ్యం అపహాస్యమైందని ప్రధాని మోడీ కక్షపూరిత రాజకీయాలు చేస్తున్నారని, సెలక్షన్ కమిషన్‌గా ఎలక్షన్ కమిషన్ మారిందని విమర్శించారు. కాంగ్రెస్ బలంగా ఉంటే దేశం, రాష్ట్రం బాగుంటాయని అన్నారు.


## సిమెంట్ బెంచీల ఏర్పాటు



ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో14వ తేదీ సిద్దలయ్యకోనలోని సిద్దేశ్వరస్వామి, పరమేశ్వరుల సన్నిధిలో భక్తుల సౌకర్యార్థం ప్రగతి సేవా సంస్థ కుటుంబసభ్యులు వేమారెడ్డి సురేంద్రనాథ్‌రెడ్డి, ఆరికట్ల బాలకృష్ణమనాయుడు సహకారంతో రెండు సిమెంట్ బెంచ్‌లను అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ సతీమణి లక్ష్మీదేవి, ఉపాధ్యక్షులు బండి ధనంజయరెడ్డి సతీమణి శైలజమ్మ చేతుల మీదగా అందివ్వడం జరిగింది. అనంతరం సిద్దలయ్యకోనలో దైవ దర్శనం చేసుకొని, అందరూ కలసి భోజనాలు చేశారు.

గ్రంథ సమీక్ష

# సమాజానికి వెలుగుబాటలు చూపే.. 'జ్ఞాన దీపిక'




రచన :
**డా॥ చీమకుర్తి వేంకటేశ్వరరావు**
వెల : అమూల్యం పేజీలు : 144
ప్రతులకు: శ్రీ సత్యానందాశ్రమము
ఇనమడుగు, నెల్లూరుజిల్లా.
సెల్: 94402 79712
డా॥ చీమకుర్తి వేంకటేశ్వరరావు
పి.టి.జి. రాజ్ టవర్స్, ఎస్.10 థర్డ్ ఫ్లోర్,
రేబాలవారి వీధి, స్టోన్‌హౌస్‌పేట,
నెల్లూరు - 2. సెల్ : 9908855294.

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లాలోని కోవూరు మండలము ఇనమడుగులో ఉన్న శ్రీ సత్యానందాశ్రమ ఆస్థాన పండితులు, ప్రముఖ కవి, ఆధ్యాత్మికోపన్యాసకులు, విద్వాన్ డాక్టర్ చీమకుర్తి వేంకటేశ్వరరావు దశాధిక గ్రంథకర్త. 'గీతామృతము', 'శ్రీనివాస కల్యాణము', 'జగదంబ శతకము', 'పద్యహారతి' మొదలైన గ్రంథములు విరచించిన శ్రీ వేంకటేశ్వరరావు ఇటీవల సమ కూర్చిన 'జ్ఞానదీపిక' గ్రంథము సకల జనులకు సుజ్ఞానమును అందించే కరదీపిక అనడంలో ఎలాంటి సందేహము లేదు.

ఈ జ్ఞానదీపికను శ్రీ సత్యానందాశ్రమ పీఠాధిపతి శ్రీ శ్రీహరితీర్థస్వామీజీవారు తమ పవిత్ర హస్తములతో ఇటీవల మహా శివరాత్రి పర్వ దినము నాడు తమ ఆశ్రమములో ఆవిష్కరించినారు.

'శరీరము అనిత్యము, ఆత్మ సత్యము' అనే అసలైన జ్ఞానమును పొందినట్లయితే దు:ఖం అనేది లేకుండా ఎల్లప్పుడూ ఆనందంగా ఉండవచ్చునని విశదీకరించే ఆధ్యాత్మిక దృక్పథం గల గ్రంథము.. ఈ జ్ఞానదీపిక. ఈ గ్రంథములో మానవ జీవితానికి సంబంధించిన అనేక అంశములు ఉన్నవి. పుణ్యకర్మలు, పాపకర్మలు, కర్మభేదములు, సద్గురువు, సాధనా చతుష్టయము, మనస్సు, బుద్ధి, అహంకారము, ఆత్మ, అనాత్మ, కర్మయోగము, గృహస్థాశ్రమము వంటి ముఖ్యమైన విషయములు, వాటి విశిష్టతలు అందరికీ సులభగ్రాహ్యమయ్యే విధంగా రచయిత వివరించియున్నారు. ఆయా విషయములను ప్రస్తావించే సందర్భాల్లో రచయిత భగవద్గీత, వివేక చూడామణి, మహాభారతము, ఉపదేశసారము, యోగవాసిష్టము, భజగోవిందము, భర్తృహరి సుభాషితములు, ముకుందమాల, పోతన భాగవతము, ఉపదేశ రత్నావళి, హితోపదేశము మొదలైన ఉద్గ్రంథముల నుండి ప్రధాన శ్లోకములను, పద్యములను, మహర్షుల సూక్తులను ఉదహరించుచూ తాము వివరించిన అంశములను చక్కగా ధృవీకరించడము జరిగినది. ప్రజలు తమ నిత్యజీవితములో ఏయే విషయములను ఆలోచించవలెనో, వాటిని ఎలా ఆచరించవలెనో కూడా స్పష్టం చేశారు. శోకం తొలగిపోయేందుకు మనోనిగ్రహంతో ఎలా మెలగాలో విశదీకరించినారు.

అజ్ఞానంతో జీవించినట్లయితే జీవితం దు:ఖమయం అవుతుందని, ఈ జ్ఞానదీపికను చదివి అవగాహన పెంచుకుని, జీవిత సత్యాలను తెలుసుకుని ఆచరించినట్లయితే తమ జీవితాలను సంతృప్తితోను, ఆనందముతోను సాగించవచ్చునని తెలియజేసినారు.

సంపదలు స్వప్న సమానములని, ఉన్నదాంతో సంతృప్తిని కలిగి యుండవలెనే తప్ప దురాశకు పోకూడదని, ఎంత సంపద ఉన్నా తృప్తి లేనివాడే అసలైన పేదవాడని, శుభ-అశుభ కర్మ ఫలములను మానవుడు తప్పక అనుభవించక తప్పదని, మితిమీరిన కోరికల వలన క్రోధము, మోహములు కలిగి అవి క్రమంగా వినాశనమునకు దారితీయునని శ్రీ వేంకటేశ్వరరావు ఈ గ్రంథం ద్వారా వివరించడము జరిగినది. ఏ కర్మను ఎలా ఆచరించవలెనో శాస్త్రం చెబుతున్నదని, అందు వలన శాస్త్రమునే ప్రమాణముగ తీసుకొనవలెనని ఎన్నో వివరణలతో ఈ గ్రంథములో పేర్కొన్నారు. అలా.. ఈ గ్రంథంలోని అంశాలన్నీ పాఠకులను సన్మార్గం వైపు, అచంచల భక్తిమార్గం వైపు నడిపించేందుకు ఎంతగానో ఉపయోగపడగలవు. 'జ్ఞాన దేవ తు కైవల్యమ్' అంటూ జ్ఞానంతో మానవుడు దీపించాలని ఈ 'జ్ఞానదీపిక' మానవుని అసలైన ఆధ్యాత్మికానందమయ జీవనానికి అవసరమైన అనేక విషయములను మనకు తెలియజేస్తూ ఉంది. మహాభారతములోని 'ఒరులేయవి యొనరించిన' అనే పద్యాన్ని వివరిస్తూ, 'ఇతరులు ఏ పనిచేస్తే మనకు కష్టం కలుగుతుందో, ఆ పనిని మనం ఇతరుల పట్ల చేయకూడదని' తెలిపారు. ధర్మమును పెద్దల ద్వారా గ్రహించి అందరూ సద్బుద్ధితో జీవిస్తూ సన్మార్గములో పయనించాలని, దానగుణముతో జీవించాలని, పరోపకారము ద్వారా జీవితాలను ధన్యం చేసుకోవాలని పేర్కొన్నారు. మహర్షులు బోధించిన అనేక విషయాలను తెలియజేస్తూ, 'అత్యాశను జయించాలని, 'కష్టసుఖములను లెక్కచేయకుండా కార్యసాధనయే లక్ష్యంగా ముందుకు సాగవలెనని', 'సకల భోగములు రోగ కారకములని.. వైరాగ్యం మాత్రమే భయము లేని సాధనయని' రచయిత సరళసుందరంగా వివరించినారు. అజ్ఞానమనేది అంధకారం వంటిదని, దానినుంచి బయటపడేందుకు జ్ఞానదీపమును వెలిగించుకోవాలని, ఆధ్యాత్మికజ్ఞానము ద్వారా మానవుడు అసలైన భగవత్తత్వాన్ని, భగవద్రూపాన్ని తెలుసుకోగలుగుతాడని వివరించారు.

ఎంతో అమూల్యమైన విషయములతో కూడిన ఈ గ్రంథము చదవరులందరికీ అందుబాటులో ఉంచేందుకు 'వెల' లేకుండా 'అమూల్యము' అని నిర్ణయించడము రచయిత ఔదార్యమునకు నిదర్శనము. పాఠకులు ఈ 'జ్ఞానదీపిక'ను ఉచితముగా పొందవచ్చు. ఇలాంటి సుజ్ఞానమయము.. విజ్ఞానవంతము అయిన 'జ్ఞానదీపిక'లు నేటి సమాజమును వెలుగుబాటలో నడిపిస్తాయి. ఇలాంటి అపూర్వమైన గ్రంథమును విరచించిన శ్రీ చీమకుర్తి వేంకటేశ్వరరావు అభినందనీయులు. భవిష్యత్తులో వారు మరిన్ని ఉత్తమ గ్రంథములను వెలువరించగలరని ఆశిద్దాము!...



**సమీక్ష : అవధాని కోట రాజశేఖర్,**
**99662 36604**

# ప్రభుత్వ బడుల.. ప్రతిష్ట పెరిగింది

## • 4 లక్షలకు పైగానే విద్యార్థుల చేరిక



**ఒకప్పుడు ప్రభుత్వ బడులంటే చాలామందికి చిన్నచూపుగా ఉండేది. అక్కడ చదువులు బాగా ఉండవని, ఉపాధ్యాయులు సరిగా రారని, వసతులనేవే కనిపించవని అనుకుంటూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపాలంటే అత్యధికశాతం మంది ప్రజలు అయిష్టంగా ఉండేవారు. అందుకు తగ్గట్టుగానే అనేకమంది అధికారులు, ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు వంటి వారు కూడా ప్రైవేటు బడులు, లేదా కార్పొరేట్ పాఠశాలల వైపే మొగ్గుచూపుతుండేవారు. కార్పొరేట్ స్కూళ్ళలో పిల్లల్ని చదివించడం వల్లనే ఉన్నతమైన ఉద్యోగాలు వస్తాయని ఆశపడేవారు. వేలు, లక్షల్లో సైతం ఫీజులు చెల్లించుకుని కార్పొరేట్ స్కూళ్ళకు పరుగులు తీస్తుండేవారు. ఇప్పుడా పరిస్థితి పూర్తిగా సమసిపోతోంది. ప్రభుత్వ బడుల్లో చేరేందుకు విద్యార్థులు, తల్లిదండ్రులు ఎంతో ఇష్టపడుతున్నారు. దీంతో ప్రైవేటు పాఠశాలల కంటే ప్రభుత్వ బడుల ప్రతిష్ట ఎంతగానో పెరుగుతోంది.**

రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చాక చిన్నారుల విద్య పట్ల గతంలో ఎప్పుడూ లేనంతగా శ్రద్ధ పెట్టి అనేకరకాలైన పథకాలతో పిల్లల చదువులకు ప్రోత్సాహం ఇస్తుండడంతో అటు పేద విద్యార్థులే కాక అన్నివర్గాల ప్రజలు ప్రభుత్వ పాఠశాలలపై దృష్టి పెడుతున్నారు. దీంతో ప్రభుత్వ బడుల్లో చేరే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతుండడం ఎంతైనా విశేషం. పిల్లల చదువులు పెద్దలకు భారం కాకూడదని సిఎం జగన్ 'అమ్మఒడి' పథకానికి శ్రీకారం చుట్టడం, ప్రభుత్వ బడులు సౌకర్యవంతంగా ఉండేందుకు 'నాడు-నేడు' పథకంతో అన్ని విధాలా చర్యలు చేపడుతుండడంతో ఎవరూ ఊహించని విధంగా రాష్ట్రంలో దాదాపు నాలుగు లక్షల మంది దాకా విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరేందుకు సంసిద్ధులయ్యారని అంచనా. దీంతో ఈ ఏడాది 'జగనన్న విద్యాకానుక' బడ్జెట్ కూడా భారీగానే పెరగనుంది. అయినా సరే, ఈ పథకాలను నూటికి నూరుపాళ్ళు అమలుచేసి విద్యార్థులందరినీ ఆ చదువుల తల్లికి చేరువ చేయాలనే సదుద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ప్రజలందరి అభిమానానికి పాత్రమవుతున్నాయి. ఒక్క 'జగనన్న విద్యాకానుక' పథకం కిందే సుమారుగా 731 కోట్లకు పైగానే నిధులను ప్రభుత్వం కేటాయించి విద్యార్థులందరి విద్యాభ్యాసానికి అవసరమైన విద్యాసామగ్రినంతా కిట్‌ల రూపంలో అందించేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు.

### 43 లక్షల మందికి 'జగనన్న విద్యా కానుక' :

1 నుంచి 10వ తరగతి దాకా విద్యార్థులకు అందించే జగనన్న విద్యాకానుక కిట్లలో 3 జతల యూనిఫారంలు, షూ, 2 జతల సాక్సులు, బెల్టు, స్కూలు బ్యాగ్‌లతో పాటు పాఠ్యపుస్తకాలు, వర్క్‌బుక్‌లు, నోట్‌బుక్‌లు అన్నీ అందించనున్నారు. ఈసారి కొత్తగా విద్యార్థులకు ఎంతో అవసరమైన ఇంగ్లీష్-తెలుగు 'డిక్షనరీ'ని కూడా అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభుత్వ స్కూళ్ళలో ఆంగ్లమాధ్యమం ప్రవేశపెట్టిన నేపథ్యంలో అత్యధికశాతం మంది తల్లిదండ్రులు అందుకు మద్దతు ఇస్తుండ డంతో విద్యార్థుల చదువులకు ఈ ఏర్పాట్లన్నీ చురుగ్గా సాగుతున్నాయి. దాదాపు 96 శాతం మందికిపైగానే తల్లిదండ్రులు ఆంగ్లమాధ్యమానికి ఆప్షన్ ఇవ్వడం విశేషం. ప్రభుత్వం ఆంగ్లమాధ్యమాన్ని ప్రవేశపెట్టినా తెలుగుభాషకు కూడా అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అన్ని పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకు తెలుగును తప్పనిసరి చేయడం తెలిసిందే. అంతేకాదు ప్రభుత్వ స్కూళ్లలో బ్రిడ్జి కోర్సులతో పాటు ఇంగ్లీష్ ల్యాబ్స్ ఏర్పాటుకు కూడా సన్నాహాలు జరుగుతున్నాయి.

### 'నాడు-నేడు'తో అన్ని సదుపాయాలు :

ఇప్పటికే ముఖ్యమంత్రి జగన్ సారధ్యంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'అమ్మ ఒడి', 'నాడు-నేడు' పథకాలు ప్రజల్లో విశేషమైన ఆదరాభిమానాలు పొందుతున్నాయి. 'నాడు-నేడు'తో ప్రభుత్వ బడుల్లో గతంలో ఎప్పుడూ లేనంతగా సౌకర్యాలు సమకూరుతుండడం, నాటి బడుల రూపురేఖలు మారిపోయి అసౌకర్యాల నిలయాలుగా ఉన్న బడులు ఇప్పుడు సరస్వతీ నిలయాలుగా అభివృద్ధి చెందుతుండడంతో విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో ఉన్నారు. తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్చేందుకు పిల్లల తల్లిదండ్రులు ఎంతో ఆసక్తిచూపుతున్నారు. దీంతో రానున్న విద్యాసంవత్సరానికి అన్ని ప్రభుత్వ స్కూళ్ళలో చదువుతున్న దాదాపు 43 లక్షల మంది పిల్లలకు విద్యా సామగ్రి కిట్లు అందనున్నాయి. గత ఏడాదితో పోలిస్తే ఇప్పటికి దాదాపు నాలుగు లక్షల మందికి పైగానే విద్యార్థుల సంఖ్య పెరగడంతో ఆ విద్యార్థుల కోసం అదనపు నిధులను కేటాయించింది ప్రభుత్వం.అంతేకాదు, బడిపిల్లలకు మంచి పౌష్టికాహారం ఉండాలనే ఉద్దేశంతో మంచి మెనూతో 'జగనన్న గోరుముద్ద' పథకం కూడా అందుబాటులో ఉండడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# టీకాతో కరోనా దూరం

## కోవిడ్ వ్యాక్సిన్ వేయించుకున్న కాకాణి



వైఎస్సార్సీపి జిల్లా అధ్యక్షుడు, సర్వేపల్లి శాసనసభ్యుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఈనెల 15న నెల్లూరు కోటమిట్టలోని అర్బన్ హెల్త్‌సెంటర్‌లో కోవిడ్ నివారణకు టీకా వేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవిడ్ వ్యాక్సిన్ ఎంతో సురక్షితమని, ప్రతి ఒక్కరూ టీకా వేయించుకుని కరోనాను దూరం చేయాలని చెప్పారు. కరోనా మహమ్మారి అంతమయ్యేవరకు ప్రజలు తప్పనిసరిగా మాస్కులు ధరించాలని, శానిటైజర్లు వినియోగించుకోవాలని, సామాజిక దూరం పాటించాలని తెలిపారు. డిఎంహెచ్ఓ రాజ్యలక్ష్మి, వైద్యులు మొహసినా సుల్తానా, జయంతి, అమరేంద్రనాథ్‌రెడ్డి, సిఓ తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

# వేతనాలు చెల్లించండి.. మహాప్రభో!

## పారిశుద్ధ్య కార్మికుల వేడుకోలు

ప్రభుత్వం బడ్జెట్ విడుదల చేసినా తమకు చెల్లించాల్సిన వేతనాల బిల్లులు పెట్టకుండా అధికారులు ఇబ్బందిపెడుతున్నారని, దీంతో తామెన్నో బాధలు పడుతున్నామని, ఉన్నతాధికారులు వెంటనే పరిశీలించి తమ వేతనాలిచ్చేందుకు కృషిచేయాలని కోరుతూ నెల్లూరులోని అనేకమంది పారిశుద్ధ్య కార్మికులు నగరంలోని పెద్దాసుపత్రి ఎదుట ఈనెల 15న ఆందోళన చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనలో సిఐటియు గౌరవాధ్యక్షుడు మాదాల వెంకటేశ్వర్లు, నాయకులు సతీష్, అజీజ్, బత్తల కృష్ణయ్యతో పాటు జనసేన నాయకుడు టోనిబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ ఆందోళన సమాచారం తెలిసి జిజిహెచ్ అభివృద్ధి కోఆర్డినేటర్ లక్ష్మీసునంద వారివద్దకు వచ్చి ఈ నెలాఖరులోగా పెండింగ్ వేతనాలు వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

# భక్తుల పాలిట కల్పవృక్షం.. 'కాటేపల్లి' శివాలయం

**ఆదిదేవుడైన ఆ మహాశివుడు భక్తులను కటాక్షించేందుకు అనేక ప్రాంతాల్లో స్వయంభువుగా ఆవిర్భవించాడు. సకల చరాచర విశ్వమంతటా తానే అయివున్న ఆ దేవదేవుడు తన దివ్యలీలలను ప్రదర్శిస్తూ లోకకల్యాణార్ధం అనేక ప్రాంతాల్లో లింగరూపధారిగా అవతరించి అందరినీ తన చల్లని కరుణాకటాక్ష వీక్షణాలతో కాపాడుతూనే ఉన్నాడు. జిల్లాలో కూడా.. అలా అదృష్టవశాత్తూ ఓ భక్తునికి కాటేపల్లి వద్ద లభించిన శివలింగమే కాలక్రమంలో 'కాటేపల్లి శివాలయం'గా రూపుదిద్దుకుని భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. భక్తుల పాలిట కల్పవృక్షంగా నిలిచిన ఈ ఆలయ ఆవిర్భావానికి సంబంధించి ఓ ఆసక్తికరమైన కథనం కూడా ఉంది.**



## మన దేవాలయాలు (39)

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని అపురూపమైన దేవాలయాల్లో కాటేపల్లి శివాలయం ఒకటి. తోటపల్లి గూడూరు మండలంలోని 'మండపం' పంచాయతీ పరిధిలోని సముద్ర తీరంలో ఉన్న 'కాటేపల్లి' అనే కుగ్రామంలో ఈ ఆలయం ఉంది. కొద్దికాలంలోనే ఈ ఆలయం ఎంతగానో అభివృద్ధి చెంది జిల్లాలోని ప్రఖ్యాతమైన శివాలయాల్లో ఒకటిగా పేరొందడం విశేషం. భక్తాభీష్టప్రదాయకుడైన ఆ శంకరుడే ఇక్కడ కామాక్షి దేవి సమేత శ్రీ చంద్రశేఖరస్వామిగా కొలువై ఉంటూ అందరి కష్టాలు బాపుతూ భక్తుల పూజలందుకుంటున్నాడు.

### ఆలయ చరిత్ర :

ఈ ఆలయ ఆవిర్భావానికి సంబంధించి ఒక కథనం ప్రచారంలో ఉంది. సుమారు 50 ఏళ్ళ క్రితం నాటి సంగతి ఇది. విడవలూరు మండలంలోని తుమ్మగుంట గ్రామానికి చెందిన భట్టారం కామయ్యస్వామి అనే భక్తుడు ఎప్పుడూ భగవన్నామస్మరణ చేసుకుంటూ భిక్షాటనతోనే జీవిస్తూ ఉండేవాడు. అలా తిరుగుతూ తిరుగుతూ ఓసారి అటవీ ప్రాంతంగా ఉన్న కాటేపల్లి గ్రామానికి భిక్షాటనకు వచ్చాడు. అక్కడి అడవిలో ఉంటూ రోజూ ఉదయాన్నే సముద్రస్నానం చేసుకుని గ్రామంలోకి భిక్షాటనకు బయలుదేరేవాడు. ఆ క్రమంలో ఓరోజు సముద్రం వద్ద నుంచి తిరిగివస్తుండగా పొదల్లో ఆయనకు ఒక అపురూపమైన శివలింగం కనిపించింది. ఈతపండ్లు నైవేద్యంగా సమర్పించివున్న ఆ శివలింగాన్ని చూడగానే సాక్షాత్తూ శివదర్శనం జరిగినంత ఆనందంతో ఆ శివలింగాన్ని తీసుకునివచ్చి, తానున్న ప్రదేశంలో తాటాకుల పందిరి ఏర్పాటుచేసి భక్తితో పూజించడం మొదలు పెట్టాడు. తన భిక్షాటనతో వచ్చినదాంతోనే తన చేతనైనంత వరకు స్వామివారికి పూజలు, అభిషేకాలు, సేవలు చేసేవాడు. కాలక్రమంలో కొంతమంది భక్తులు ఎంతో కళగా ఉన్న ఆ శివలింగాన్ని దర్శించుకుని అక్కడ ఆలయం నిర్మిస్తే బావుంటుందనే ఆలోచనకు వచ్చారు. గ్రామస్తులు, దాతలు, భక్తులందరి సహకారంతో దేవాలయ నిర్మాణానికి పూనుకున్నారు. దీంతో అక్కడ అత్యంత సుందరమైన రీతిలో ఆలయం ఏర్పడింది. రమణీయమైన ప్రకృతి సోయగాలతో అలరారే ఈ ప్రాంతంలో సుప్రశాంతమైన ఆధ్యాత్మిక వాతావరణంలో ఈ ఆలయాన్ని సర్వాంగసుందరంగా నిర్మించి ఆ పరమశివుని పట్ల తమ భక్తిని చాటుకున్నారు. ఆలయంలో శ్రీ కామాక్షిదేవి అమ్మవారు, శ్రీ చంద్రశేఖర స్వామివారితో సహా అనేక దేవతాప్రతిమలను ప్రతిష్టించి శాస్త్రోక్తంగా పూజలు చేయడం ప్రారంభించారు. అలా కొద్దికాలం గడిచాక 2013లో కామయ్యస్వామి కాలధర్మం చెందారు. తాను మరణిస్తే తనను ఆ మహాశివునికి అభిముఖంగా అనుష్ఠానం చేస్తున్నట్లుగా ఉంచి సమాధి చేయాలని ఆయన ముందుగానే కోరి ఉండడంతో, భక్తులు సరిగ్గా అదేవిధంగా కామయ్యస్వామిని సమాధి చేసి ఆయన విగ్రహమూర్తిని కూడా అక్కడ ప్రతిష్టించారు. ఆలయంలోని దేవతామూర్తులకు, ఆలయంలో ప్రతిష్టించివున్న అనేకానేక విగ్రహమూర్తులందరికీ పూజలు జరిగాక, కామయ్యస్వామి విగ్రహానికి కూడా పూజలు జరుగుతాయి. కామయ్య స్వామి వంశస్తుల ఆధ్వర్యంలో ఆలయంలో నిత్యపూజలు జరుగుతున్నాయి.

### వేడుకగా శివరాత్రి ఉత్సవాలు :

'మహా శివరాత్రి' వచ్చిందంటే చాలు..కొద్దిరోజుల ముందు నుంచి శివభక్తులు కాటేపల్లి శివాలయానికి తండోపతండాలుగా తరలివచ్చి పూజలు చేస్తుంటారు. దీంతో కాటేపల్లి గ్రామమంతా భక్తజన కోలాహలంతో నిండిపోతుంది. శివ నామ స్మరణలతో ఆలయం మార్మోగిపోతుంటుంది. ఈ సందర్భంగా దాతలు, నిర్వాహకులు, భక్తులు అందరూ కలసి ఆలయాన్ని విద్యుద్దీప కాంతులతో శోభాయమానం చేస్తారు. స్వామివారికి, అమ్మవారికి కన్నులపండువగా అలంకారాలు, విశేష పూజలు నిర్వహిస్తారు. ప్రతిఏటా కార్తీకమాసంలో జరిగే ఉత్సవాలకు కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు. కార్తీక దీపాల వెలుగులో ఆలయం దేదీప్యమానంగా వెలుగొందుతూ భక్తులందరిని ఆధ్యాత్మిక భక్తిభావనలతో తన్మయుల్ని చేస్తుంటుంది.

# జగన్‌కే జై కొట్టిన జనం

(మొదటి పేజీ తరువాయి)

పాలయ్యాడు, వేలకిలోమీటర్ల పాదయాత్ర చేశాడు, తల్లిని భార్యని బిడ్డలని వదిలిపెట్టి 10 సంవత్సరాలు ప్రజల మధ్యనే తిరిగాడు. భారత రాజకీయ రంగ చరిత్రలో ఇన్ని లక్షలమంది ప్రజల ముంగిళ్లలోకి నేరుగా వెళ్లగలిగిన ఏకైక నాయకుడిగా జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలబడిపోతాడు. తన నాన్న ఫోటో పక్కనే ప్రతి ఇంట్లో తన ఫోటో ఉండాలన్నాడు, దేశం రాష్ట్రం వైపు చూసేలా పరిపాలన సాగిస్తానన్నాడు, ఒక్క అవకాశం ఇస్తే తానేంటో చుపిస్తానన్నాడు.

ఇప్పుడు అదే జరుగుతోంది, 151 సీట్లిచ్చి దీవించిన జనం కోసం నిరంతరం తపిస్తున్నాడు. నవరత్నాల పథకాలను వరమాలగా కూర్చి ప్రజల మెడలో వేశాడు, ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటి తలపు తట్టి వారి తలపుల్లో నిలిచిపోయాడు. తనకు ప్రజలు అధికారం కట్టబెట్టిన 22నెలల తరువాత వచ్చిన స్థానిక ఎన్నికలలో జగన్‌మోహన్‌రెడ్డి

## ఫలితాలు ఏకపక్షమే

***రాష్ట్రంలో పురపాలక సంఘాలు, నగర పంచాయతీలు కలిపి మొత్తం 75 స్థానాల్లో ఎన్నికలు జరిగితే 73 స్థానాల్లో వైసిపి జయకేతనాన్ని ఎగురవేసింది. మిగిలిన రెండుచోట్ల కూడా రెబల్స్ ప్రభావంతో హంగ్ ఏర్పడింది తప్ప తెలుగు దేశం లాభపడలేదు. ఎన్నికలు జరిగిన 12 కార్పొరేషన్లకు గాను 11 స్థానాలు జగన్‌మోహన్‌రెడ్డి పార్టీయే కైవసం చేసుకుంది. (కోర్టు నిర్ణయం కారణంగా ఒక్క చోట ఫలితం ప్రకటించలేదు). వైసిపి ఓటమి పాలైన తాడిపర్తి, మైదుకూరు పట్టణాల విషయాన్ని గమనిస్తే... తాడిపర్తిలో విజయం జేసీ సోదరులది తప్ప తెలుగుదేశంపార్టీది కాదు. అదీ హోరా హోరీ పోరుగా కనపడుతోంది తప్ప ప్రతిపక్షం గొప్పగా చెప్పుకోవలసిందేమి లేదు. మైదుకూరు ఫలితాన్ని ఇప్పుడు ఓడిన వైసిపితో పాటు గెలిచిన టిడిపి కూడా సమీక్షించు కోవాలి. ఎందుకు ఓడిపోయామని ఒకరు, ఎలా గెలిచామని మరొ కరు ఆరా తీసుకోవాలి.***


ఎక్కడా ప్రచారం చెయ్యలేదు. గడప దాటకపోగా, పెదవి కూడా విప్పలేదు. తమ పార్టీకి ఓటు వేసి తనను బలపరచమని నామమాత్రంగానైనా అడగలేదు. తనదైన తరహాలో పాలనపైనే దృష్టిపెట్టాడు, విశ్వసనీయతకే పెద్దపీట వేశాడు. నిరంతరం ప్రజాసేవలోనే తన పని తాను చేసుకుంటూ వెళ్ళాడు. ప్రజలు కూడా తమ పని తాము చేసి చూపించారు, 'మా మంచి కోరే మా రాజువి నువ్వేనయ్యా' అంటూ జగన్ నాయకత్వాన్ని మరింత బలపరిచారు, భారీ విజయంతో ఆదరించి ఆశీర్వదించారు.

## నలభైయేళ్ల ఇండస్ట్రీకి నలుగు పెట్టారు...

ఈ ఎన్నికలలో నలభై సంవత్సారాల అనుభవశాలి నవ్వులపాల య్యాడు. అర్థంలేని ఆవేశంతో అబాసు పాలయ్యాడు. ఆనవాయితీని మరచి మేనిఫెస్టో విడుదల చేశాడు, ఊరూరా తిరిగి అరచి గీ పెట్టాడు. సంయమనం కోల్పోయి మాటలు తూలాడు. పక్క పార్టీ వాళ్లే కాకుండా సొంత పార్టీ వాళ్ళు సైతం ఆసహ్యించుకునేలా గుంటూరు, విజయవాడ, విశాఖ ప్రజలు సిగ్గుంటే జగన్‌మోహన్‌రెడ్డి పార్టీకి ఓటెయ్యొద్దని పిలుపు నిచ్చాడు. ఆయన వికృత చేష్టలకు అంతకంతా స్పందించిన ఓటర్లు అంతే స్థాయిలో ఆయనకు శాస్తి చేశారు. నలభైయేళ్ల అనుభవశాలికి నలుగు పెట్టి ఇంటికి పంపించారు.

## ముఖ్యమంత్రి ఇప్పుడు ఇంకా జాగ్రత్తగా అడుగెయ్యాలి...

ఇప్పుడు జరిగిన స్థానిక ఎన్నికలు జగన్మోహన్‌రెడ్డి పరిపాలనకు రెఫరెండం లాంటివి. ఆయన 3 రాజధానుల ప్రతిపాదనను ప్రజలు స్వాగతించారు. గుంటూరు, విజయవాడ వాసులే పాలనావికేంద్రీకరణకు మద్దతు పలికారు. ఇది అనూహ్యమైన విజయం, కొంతమంది సొంతపార్టీ వాళ్లే ఊహించని ఫలితం. ఎవరైనా ఇక ఆయనకు తిరుగులేదనుకునే విజయం. కానీ, ఇప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి ఇంకా జాగ్రత్తగా అడుగె య్యాలి. ప్రతిపక్షమన్న పదానికే ఆంధ్రాలో అడ్రస్ లేకుండా చేసిన జగన్‌మోహన్‌రెడ్డిపై ఇప్పుడు కమలం పార్టీ కన్ను పడుతోంది. ఈ ఎన్నికల ఫలితం వారికి ఊహించని పరిణామం. తెలుగుదేశం చిత్తవు తుందనే ఊహించి ఉంటారు తప్ప 52 శాతంపైగా ప్రజలు జగన్ వెంట ఉంటారని ఆ పార్టీ ఊహించకపోయి ఉండవచ్చు. మిగిలిన పార్టీల విషయం అసలు లెక్కలోకి తీసుకోవాల్సిన అవసరం లేక పోయినా, ఇక్కడ భారతీయ జనతాపార్టీని మాత్రం తక్కువగా అంచనా వేయకూడదు. టక్కు టమార విద్యలతో, కుట్రపూరిత చర్యలతో, రాష్ట్ర ప్రభుత్వాలని ఇబ్బంది పెట్టే బీజేపీ వారిని ఒక కంట కనిపెడుతూనే జగన్ ముందడుగు వెయ్యాలి.



# వేయి శుభములు కలుగు నీకూ..

# పోయిరారా చందురూడా...!

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు ముగిశాయి. ఏ పార్టీకి ఎంత శాతం మేరకు ఓట్లు వచ్చాయో కూడా తెలిసింది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో జగన్ మానస పుత్రిక అయిన వైసీపీకి ఎంత శాతం మేరకు ఓట్లు లభించాయో... ఇప్పుడూ కుడి ఎడంగా అంతే శాతం ఓట్లు లభించాయి. 52 శాతం అని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రకటించింది.

తెలుగుదేశంకు మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో 40 శాతం ఓట్లు వచ్చాయి. ఈ రెండేళ్లలో వైసీపీ 'అరాచక'పాలన మీద, 'అప్రజా స్వామిక' ప్రభుత్వం మీద, 'దోపిడీ' పాలకుల మీద, 'శాడిస్ట్' ప్రభుత్వం మీద చంద్రోపచంద్రులు 'పోరాటాలు' చేస్తూ వచ్చారు. ట్వీట్ల మీద ట్వీట్లు ట్వీటించారు. రోజూ ప్రెస్‌మీట్లు పెట్టారు. 'ఖబడ్దార్... గుండెల్లో నిద్రపోతా...' అన్నారు. 'ఇంతకు ఇంతా వడ్డీతో చెల్లిస్తాం...' అన్నారు. ఎన్నికల్లో చింపి... పోగులు పెడతాం. చూస్తూ ఉండండి...' అన్నారు. ఎక్కడ సందు దొరికితే... అక్కడ నేలపై కూర్చుండి పోయారు.

ఇంత చేసిన తరువాత... వైసీపీ ఓటు శాతం 50 నుంచి 30కి దిగాలి. కనీసం నలభైకి అయినా దిగాలి కదా! తెలుగుదేశం ఓటు శాతం 40 నుంచి 50కి పెరగాలి. ప్రతిపక్ష ఓటు శాతం పెరగడం అనేది సహజంగా జరిగే ప్రక్రియ.

కానీ, రెండేళ్ల నుంచి ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ ఓటు శాతం మాత్రం 40 నుంచి 30కి పడిపోయింది. దాని అనధికార మిత్రపక్షమైన జనసేన ఓటు శాతం మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఆరు శాతం నుంచి నాలుగున్నరకు పడిపోయింది. ఈ ఫలితాలు చూస్తుంటే 'బాబు గారూ... రాజకీయం చాల్లే... మీ మాన్యుపులేషన్ ఇక వర్క్‌ఔట్ అవ్వదు.' అని చెప్పాలీ అనిపిస్తున్నది. ఆయన మాన్యుపులేషన్ వర్క్ ఔట్ అయ్యే రోజుల్లో ఓట్లు సంపాదనకు ఆయన అవలంబించిన చిత్ర, విచిత్రమైన సామ, దాన, భేద, దండో పాయాలనే ఇప్పుడు వైసీపీ అనుసరిస్తున్నట్టు కనపడుతున్నది. వైసీపీ డబ్బులు పంచిందని, పోలీసులను పెట్టి ప్రత్యర్థులను కట్టడి చేసిం దని, సారా పోయించిందని, దౌర్జన్యాలు చేసిందని, ప్రజలు తమవైపే ఉన్నా... ఓట్లు మాత్రం వేయలేక పోయారని... అది అనీ, ఇది అనీ టీడీపీ నాయకులు చెణుకులు విసురుతున్నారు. రామారావుకు వెన్నుపోటు పొడిచి తెలుగుదేశం పార్టీని లాక్కున్న తరువాత చంద్రబాబు మూడుసార్లు ముఖ్యమంత్రి పదవి నిర్వహించారు. మూడవ సారి ప్రతిపక్ష నేత పాత్ర పోషిస్తున్నారు.






'మేం మీ అంత డబ్బులు పంచలేక పోయాం. పోలీస్ వ్యవస్థను వాడుకోలేక పోయాం. మీ అంత సారా పోయించలేక పోయాం. మీ అంత రేంజ్‌లో దౌర్జన్యాలు చేయించలేక పోయాం. అధికార వ్యవస్థను వాడుకోలేక పోయాం. అందుకే ఓడి పోయాం...' అని చంద్రబాబు అని ఉంటే... ఓ పద్దతిగా ఉండేది. 'నిజమే కదా పాపం!' అనిపించేది.

గత రెండేళ్లలో వైసీపీ ప్రభుత్వాన్ని ఎంత అల్లరి పెట్టినప్పటికీ 2019లో వచ్చిన ఓటింగ్ శాతాన్ని సైతం తెలుగుదేశం నిలుపుకో లేకపోయింది. దీనర్థం ఏమిటంటే...' మీ రోజువారీ ఏకాపాత్రాభినయాన్ని ఇక తట్టుకోలేకపోతున్నాం... మీ శ్రీరంగనీతులు వినీ వినీ చెవులు తుప్పట్టి పోయినయ్. ఇక మా మానానికి మమ్మల్ని వదిలేసి.... మీరు సెలవు తీసుకోండి' అని ఓటర్లు గౌరవంగా చెప్పడం. కుప్పంలో తెలుగుదేశం కార్యకర్తలు తమ నోటితో చెప్పిన విషయాన్నే ఓటర్లు, తమ ఓటుతో చెప్పారు.

అంటే– చంద్రబాబు మాన్యుపులేటివ్ రాజకీయాలకు ఎక్సపైరీ డేట్ ఇదే అని ఓటర్లు చెప్పేశారు అనిపిస్తున్నది. ఇంకా సూటిగా చెప్పాలంటే ముఖ్యమంత్రి జగన్ చంద్రబాబు మాన్యుపులేటివ్ రాజకీయాలకు ముగింపు పలికారు అనిపిస్తున్నది.

1983లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి, ఓడిపోయిన తరువాత టీడీపీలో చేరిన నాటినుంచీ ఆయన తన మాన్యుపులేషన్‌ను, మీడియాను నమ్ముకున్నారు. ఆ మాన్యుపులేషన్ స్కిల్స్ తోనే ఆయన మొదటిసారి ముఖ్యమంత్రి అయ్యారు. కోర్టు కేసులు తనను ఇబ్బంది పెట్టకుండా చూసుకున్నారు. తాను ముఖ్యమంత్రి అవ్వడానికి ఓ భుజం కాచిన డాక్టర్ దగ్గుబాటి వెంకటేశ్వరరావును శంకరగిరి మాన్యాలకు పంపించారు. బావమరిది నందమూరి హరి కృష్ణను చెప్పు కిందేసి తొక్కిపట్టి ఉంచారు. తన తండ్రి స్థాపంచిన పార్టీలోకి పురందేశ్వరి వచ్చే అవకాశం లేకుండా చేశారు, కాంగ్రెస్ వైపు చూడక తప్పని స్థితి కల్పించారు. తన రాజకీయ ప్రయాణానికి ముందు ముందు అడ్డు రాగలరని భావించిన చిన్న, పెద్ద నేతలు ఓ రెండు వందలమందిని పార్టీ నుంచి బయటకు సాగనంపించారు.

1995లో మొదటిసారి ముఖ్యమంత్రి కాగానే పార్టీ అధ్యక్ష పదవిని వేరేవారికి ఇచ్చేస్తాను అని చెప్పిన చంద్రబాబు 26 సంవత్సరాల తరువాత కూడా అధ్యక్షుడిగానే నిరంతరాయంగా కొనసాగుతున్నారు. ఈ మొత్తం అన్నిటికీ– మాన్యుపులేషన్, మీడియానే నమ్ముకున్నారు. నోరు తెరిస్తే, నీతులు.. నీతులు.. అందుకే ఓటర్లు తిరస్కరించారు. నిర్ద్వందంగా తిరస్కరించారు. ఎన్టీఆర్ నుంచి పెరుక్కున్న తెలుగుదేశం పార్టీని, తన కొడుక్కి కట్టబెట్టడానికి చంద్రబాబునాయుడు చేస్తున్న ప్రయత్నాన్ని కూడా ఓటర్లు తిరస్కరించారు. ఎందుకంటే తెలుగుదేశం అనే ఆస్తి చంద్రబాబుది కాదు. ఎన్టీఆర్‌ది, నందమూరి కుటుంబానిది.

ప్రాంతీయ పార్టీలు వారసులవే అనుకుంటే ఎన్టీఆర్ వారసులే రంగంలోకి దిగాలి అనేది అఖిలాంధ్ర జనాభిమతంగా చంద్రోపచంద్రులు గుర్తించాలి. దేశంలో ఏ ప్రాంతీయపార్టీని కూడా వ్యవస్థాపక అధ్యక్షుని అల్లుడు కబ్జా చేసిన చరిత్ర మన దేశంలో లేదు. ఉత్తరప్రదేశ్‌లో సమాజ్ వాదీ పార్టీ నాయకత్వం ములాయంసింగ్ నుంచి, కొడుకు అయిన అఖిలేష్ యాదవ్‌కు వచ్చింది. కాశ్మీర్‌లో ముఫ్తి మహమ్మద్ సయీద్ నుంచి పీ.డీ.పీ నాయకత్వం మెహబూబా ముఫ్తీకు వచ్చింది. కాశ్మీర్ సింహం షేక్ అబ్దుల్లా నుంచి 'నేషనల్ కాన్ఫరెన్స్' పార్టీ నాయకత్వం ఆయన కొడుకు ఫరూక్ అబ్దుల్లాకు ఆయన నుంచి ఆయన కొడుకు ఒమర్ అబ్దుల్లాకు వచ్చింది. తమిళనాడులో డీ.ఎం.కే నాయకత్వం కరుణానిధి నుంచి ఆయన కొడుకైన స్టాలిన్‌కు వచ్చింది. స్టాలిన్ కొడుకు రెడీ అవుతున్నాడు. ఒక్క తెలుగుదేశం మాత్రమే ఎన్టీఆర్ వారసులకు కాకుండా నారా ఖర్జూరనాయుడు వారసులు కబ్జా చేసి, ఈ కబ్జాను లీగలైజ్ చేసే ప్రయత్నాలు చేస్తున్నారు. అందుకే, ఈ ఫలితాలు. ఇన్నాళ్లకు, జనానికి అర్థమైనందుకే చంద్రబాబు మాన్యుపులేషన్‌కు భారీ చెక్ పెట్టారు

వచ్చే శాసనసభ ఎన్నికల్లో సైతం 2019 నాటి ఫలితాలే పునరా వృతం అవుతాయనడానికి చాలా కారణాలు చెప్పవచ్చు.

1. ఇప్పుడు జరిగిన గ్రామ, పురపాలక ఎన్నికల్లో ఏకపక్ష విజయం సాధించడానికి వైసీపీ ఏ పద్ధతులు అవలంభించిందని తెలుగుదేశం నేతలు గుండెలు బాదుకుంటున్నారో వచ్చే శాసనసభ ఎన్నికల్లోనూ అవే పద్ధతులను వైసీపీ మరింత ఉత్సాహంగా అమలుచేస్తుంది.

2. చంద్రబాబు తన చేతలు, ప్రవచనాలు, ఉపదే శాలు, అసత్యాలు, వ్యవహారశైలి ద్వారా విశ్వసనీయత కోల్పోయారని జనం ఓ అంచనాకు వచ్చేశారు

3. వచ్చే ఎన్నికల నాటికి ఆయన వయస్సు 75కు చేరుకుంటుంది. ఆయనతో పోల్చు కుంటే జగన్ మాంచి దూకుడుమీద ఉంటారు.

4. చంద్రబాబు స్థానంలో, ఆ పార్టీని నడపగలిగిన నాయకత్వ పటిమ, స్థాయి కొడుకుకు లేవన్నది టీడీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానుల్లో బహిరంగ రహస్యమే.

5. అందుకే తెలుగుదేశంకు గల లక్షలాది అభిమానుల చూపు ఎన్టీఆర్ అసలు వారసు డయిన జూనియర్ ఎన్టీఆర్‌పై పడడం ఇప్పటికే ప్రారంభమైంది. జూనియర్‌ని తీసుకురాకుండా తెలుగుదేశంకు మనుగడ లేదు. వైసీపీ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న బాలినేని శ్రీనివాస్‌రెడ్డి కూడా అదే ముక్క చెప్పారు.

6. చంద్రోపచంద్రులను నమ్మి, వచ్చే ఎన్నికలలో వేల కోట్లు కుమ్మ రించడానికి దేశం మద్దతుదారులైన వ్యాపారులు ముందుకు రారు.

ఇలా చెప్పుకుంటూ పోతుంటే, చాలా కారణాలు కనపడుతుంటాయి.

ఈ రెండేళ్లలో చంద్రబాబు చేస్తూ వచ్చిన ఓవరాక్షన్‌కు కూడా ఇప్పుడు చెక్ పెట్టే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రాజధాని పేరుతో ఎస్సైయిండ్ భూములను ల్యాండ్ పూలింగ్‌లో చేర్చి, వాణిజ్య ప్లాట్‌లు పొందారనే అభియోగంపై సీఐడీ విచారణ మొదలుపెట్టి చంద్రబాబుకు నోటీసులు జారీ చేసింది. ఈ రెండు, మూడేళ్ళూ రకరకాల కేసులు తేనెటీగల్లా చంద్రబాబును, లోకేష్‌ను చుట్టుముట్టబోతున్నాయి. ఈ పరిస్థితులన్నింటినీ అంచనా వేస్తున్న 'తెలుగుదేశం వెన్నెముకలు' ఇక బాబులిద్దరివల్లా అయ్యే పని కాదన్న నిర్ణయానికి వచ్చేశారు.

అయితే, తారక రాముడు ఇప్పుడే టీడీపీ వైపు చూడడానికి సిద్ధంగా లేరు. కొత్త సున్నం గోడకు పట్టాలి అంటే పాత సున్నం మొత్తం ఊడి పోవాలి. అందుకే చంద్రోపచంద్రుల నుంచి టీడీపీ పూర్తిగా విముక్తి కావాలని జూనియర్ ఎన్టీఆర్ భావిస్తున్నారు. 2029 ఎన్నికల నాటికి జూనియర్ కోరిక నెరవేరవచ్చు. ఆయన వచ్చేవరకు, ఆ 'భారాన్ని' ఏ అచ్చన్నాయుడికో... రామ్మోహననాయుడుకో అప్పగించి చంద్రబాబు, లోకేష్‌బాబు 'గౌరవ ప్రదం'గా రోజువారీ పార్టీ కార్యక్రమాలనుంచి విశ్రాంతి తీసుకోవాలి. లేకుంటే ముందు ముందు పార్టీకి కేటాయించే సమయం అంతగా లభించకపోవచ్చు కూడా.

2029లో జూనియర్ ఎన్టీఆర్ రంగప్రవేశం చేసేవరకు.. తెలుగు దేశంకు గానీ, తమకు పెద్దగా పని ఉండకపోవచ్చునని చంద్రోప చంద్రులు గమనిస్తే... తరువాత ఏమి చేయాలనేది వారికి ఒకరు చెప్పాల్సిన పని లేదు.

***వివరణ:*** *చంద్రబాబు స్వయం ప్రకాసితుడు కాదు. ఎన్టీఆర్ అనే సూర్యకిరణాల వెలుగులో ఓ 35, 40 ఏళ్ళు ప్రకాశించినవారు. అందుకే, ఆయన 'చంద్రుడు' అయ్యారు. ఈ చంద్రుని కిరణాలు పరావర్తనం చెంది, కొడుకుపై పడడం వల్ల కొడుకూ ఉప చంద్రుడులా ప్రకా శిస్తున్నాడు. అందుకే.. వీరిద్దరూ కలిసి 'చంద్రోపచంద్రులు' అయ్యారు.*

**– భోగాది వేంకట రాయుడు**
bhogadirayudu2152@gmail.com

# రైతులు దళారుల బారిన పడకుండా చూడండి

జేసీ హరీంద్రప్రసాద్

ధాన్యం కొనుగోళ్ళ విషయంలో రైతులు దళారుల బారిన పడకుండా చూడాలని జిల్లా జాయింట్ కలెక్టర్ హరీంద్రప్రసాద్ అధికారులకు చెప్పారు. ఈనెల 15న ఆయన నెల్లూరులోని డిఆర్‌డిఏ కార్యాలయంలో జిల్లా పౌరసరఫరాల శాఖ, జిల్లా పౌరసరఫరాల సంస్థ, డిఆర్‌డిఏ, డిసిఎంఎస్ అధికారులు సిబ్బందితోను, మిల్లర్లతోను సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. జిల్లాలోని రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోళ్ళకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందని జిల్లాలో రైతులు పండించిన ధాన్యాన్ని ధాన్యం కొనుగోళ్ళ కేంద్రాల్లో ప్రభుత్వ నిబంధనల మేరకు కొనుగోలు చేయాలని, రైతులకు గిట్టుబాటు ధర ఇచ్చేందుకు కృషిచేయాలని, రైతులు పండించిన ధాన్యాన్నంతా కొనుగోలు చేసేవిధంగా చూడాలని సూచించారు. ఇప్పటిదాకా 92 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి 52వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందని, అధికారులు రైతులకు ఇబ్బందిలేకుండా ధాన్యం కొనుగోళ్ళు జరపాలని చెప్పారు. మిల్లర్లు కూడా అందుకు సహకరించాలన్నారు.

డిఆర్‌డిఏ పి.డి సాంబశివారెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి బాలకృష్ణారావు, పౌరసరఫరాల సంస్థ మేనేజర్ పద్మ, మార్కెటింగ్ శాఖ ఏ.డి రామమ్మ, డిసిఎంఎస్ మేనేజర్ వెంకటస్వామితో పాటు రైసుమిల్లుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

# గంట మోగింది

(మొదటి పేజీ తరువాయి)

తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నిక గంట మోగింది. ఏప్రిల్ 17న పోలింగ్ జరుగుతుందని, అందుకోసం మార్చి 23న నోటిఫికేషన్ విడుదల చేస్తామని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది.

2019 సార్వత్రిక ఎన్నికలలో 2 లక్షలా 28 వేలకు పైగా మెజారిటీతో విజయం సాధించిన బల్లి దుర్గాప్రసాద్ కరోనా మహమ్మారికి బలి కావడంతో ఇక్కడ ఉప ఎన్నిక అనివార్య మయ్యింది. బల్లి దివంగతుడైన రెండు వారాలలోపే తెలుగుదేశం పార్టీ పనబాక లక్ష్మిని తమ అభ్యర్థిగా ప్రకటించింది. ఇప్పుడు వైసిపి కూడా యువ వైద్యుడు గురుమూర్తిని తమ అభ్యర్థిగా బరిలో దింపింది. తాజాగా జరిగిన పుర ఎన్నికల ఫలితాలు చూసిన ప్రత్యర్థుల గుండెల్లో ఇప్పటికే దడ మొదలయ్యిందన్నది విశ్లేషకుల అంచనా. ఓట్ల ప్రభంజనంతో విజయం సాధిస్తున్న జగన్ పార్టీ జోరు చూసి ప్రచారానికి వెళ్ళడానికి కూడా ఇతర పార్టీల అభ్యర్థులు సంకోచిస్తున్నారన్నది వారి భావన.

చిత్తూరు, నెల్లూరుజిల్లాలలో ఇప్పుడు మళ్ళీ ఎన్నికల వేడి రగులుకోవడంతో పార్టీల వారు తమ అభ్యర్థులను రంగంలోకి దింపేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. నెల్లూరు జిల్లా పరిధిలో నాలుగు శాసనసభా నియోజకవర్గాలు కలిగివున్న తిరుపతి పార్లమెంట్ ఉప ఎన్నికలో పోరు కోసం పార్టీలు వ్యూహాలు సిద్ధం చేసుకుంటున్నాయి. జిల్లాలోని సూళ్ళూరుపేట, గూడూరు, సర్వేపల్లి, వెంకటగిరి నియోజకవర్గాలు తిరుపతి పార్లమెంట్ పరిధిలోకి వస్తాయి.

## రంగంలోకి దిగుతున్న అభ్యర్థులు :

ఇప్పటికే వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా డాక్టర్ గురు మూర్తిని వైకాపా కేంద్ర కార్యాలయం ఈనెల 16న ప్రకటించింది. స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నుంచి ఆయన ఆశీస్సులు అందుకున్నాడు కూడా. చిత్తూరుజిల్లా శ్రీకాళ హస్తి మండలంలోని ఏర్పేడు మండలం మన్నసముద్రం గ్రామానికి చెందిన గురుమూర్తి వైద్యరంగంలో ప్రముఖుడు. ఫిజియో థెరపిస్ట్‌గా ఆయన సేవలందిస్తున్నాడు. దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి, ఆయన కుటుంబానికి ఎంతో సన్నిహితుడు. స్విమ్స్ యూనివర్శిటీలో చదువుకుంటున్న సమయంలో విద్యార్థి నాయకుడుగానే ఆయన అప్పట్లో ముఖ్యమంత్రిగా ఉన్న డాక్టర్ వైఎస్‌ను కలవడం, రాష్ట్ర ఫిజియోథెరపిస్ట్‌ల కౌన్సిల్‌కు డాక్టర్ వైఎస్ సహకారం అందించడం కూడా జరిగింది. యువనేత వైఎస్ జగన్ ప్రజాసంకల్పయాత్ర చేసినప్పుడు ఆయన వెంటవుండి వైద్యపరంగా ఆయనకు సేవలందించాడు కూడా. ఈ నేపథ్యంలో ఆయనకు ఎంతో ప్రతిష్టాత్మకమైన తిరుపతి పార్లమెంట్ ఉప ఎన్నికల్లో అభ్యర్థిగా వైఎస్సార్‌సిపి నుంచి పోటీచేసేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అవకాశం ఇవ్వడంతో డాక్టర్ గురుమూర్తి ఎన్నికల బరిలోకి దిగుతున్నాడు. అదేవిధంగా తెలుగు దేశం పార్టీ అభ్యర్థిగా సీనియర్ నాయకురాలు పనబాక లక్ష్మిని ప్రకటించడంతో ఇప్పటికే ఆమె తన గెలుపు కోసం వ్యూహాలు సిద్ధం చేసుకుంటోంది. సిపిఎం అభ్యర్థిగా నెల్లూరు యాదగిరి పోటీలో ఉన్నాడు. తిరుపతిలో ఉప ఎన్నిక జరగబోతోందని తెలిసినప్పటి నుండే తమ వ్యూహరచనను మొదలుపెట్టిన భారతీయ జనతా పార్టీ, జనసేనలు అభ్యర్థిని ఖరారు చేయడంలో వెనుకబడి పోయారు. తిరుపతి ఉప ఎన్నికను సైతం అత్యంత ప్రతిష్టాత్మ కంగా తీసుకుని గతంలోకంటే ఎక్కువ స్థాయిలో మెజారిటీని సాధించాలని వైసిపి శ్రేణులు కంకణం కట్టుకున్నట్లు తెలుస్తోంది.

## తిరుపతి బరిలో..

# సిపిఎం అభ్యర్థిగా యాదగిరి



తిరుపతి పార్లమెంట్ ఉప ఎన్నికల్లో సిపిఎం అభ్యర్థిగా నెల్లూరు యాదగిరిని బరిలో నిలుపుతున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్ర రాజగోపాల్ తెలిపారు. ఈనెల 17న ఆయన నెల్లూరులోని సిపిఎం కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో యాదగిరిని అందరికీ పరిచయం చేశారు. నెల్లూరుజిల్లా మనుబోలు మండలంలోని కాగితాలపూరు గ్రామానికి చెందిన యాదగిరిని ఈ ఉప ఎన్నికల్లో పోటీకి తమ పార్టీ అధిష్టానం నిర్ణయిం చిందని చెప్పారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యునిగా, వ్యవసాయ కార్మిక సంఘం నాయకునిగా యాదగిరి అనేక ప్రజా పోరాటలు చేశారని ఆయన తెలిపారు. సిపిఎం నాయకులు పులిగండ్ల శ్రీరాములు, మోహన్‌రావు పాల్గొన్నారు.

# కలిసిరాని 23/3

(మొదటి పేజీ తరువాయి)

ఎం.ఎల్.ఏలను ముగ్గురు(3) ఎంపీలను చంద్రబాబు సంతలో పశువులను కొన్నట్లు కొనుక్కున్న సంగతి అందరికీ తెలిసిందే. వాళ్లంతా ఇప్పుడు దాదాపుగా కనుమరుగై పోయారు. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశంకు 23 ఎం.ఎల్.ఏ స్థానాలు, 3 ఎంపీ స్థానాలు లభించాయి. 'ఇది దేవుడు రాసిన రాత'... 'చేసుకున్నోళ్లకు చేసుకున్నంత' అంటూ ముఖ్యమంత్రి జగన్ అప్పట్లో ఎద్దేవా కూడా చేశారు. ఇప్పుడు, చంద్రబాబు, నారాయణలపై సి.ఐ.డి విభాగం పెట్టిన రాజధాని భూముల అక్రమాల కేసులో కూడా ఈ నెల 23నే విచారణకు హాజరు కావాలని నోటీసులో పేర్కొన్నారు. అదీ మార్చి (3వ నెల) నెల అంటే ఇక్కాడా మళ్ళీ 3.

ఏదో అనూహ్యం జరిగితేతప్ప, ఆయన విచారణకు హాజరైనా... కాకపోయినా, చంద్రబాబు అరెస్ట్ తప్పకపోవచ్చునని అటు రాజకీయవర్గాల్లోనూ, ఇటు న్యాయ నిపుణుల బృందంలోనూ వినిపిస్తోంది. మొత్తంమీద 23/3న ఏమి జరగబోతోంది అనే అంశం పక్కనపెడితే, చంద్రబాబును మాత్రం ఈ నంబర్లు పట్టి పీడిస్తున్నాయన్నది నిజం. బహుశా ఆ నంబర్లు ఆయనకు కలిసిరావడం లేదేమో!..

అంతే కాదండోయ్.. మార్చి 23వతేదీ మంగళవారం అని కూడా అంటున్నారు. అది ఎవరికి సుమంగళమో ఎవరికి అమం గళమో రాజకీయ తెరపై చూద్దాం...!

## వీక్షణం

-మంజీర

# కోమలి పోరాటం

'కుడి భుజం మీద కడువా, ................., దాని పేరే సారంగదరియా' అంటూ ఉర్రూత లూగిస్తున్న పాటకు తెర మీద సాయిపల్లవి అంతే హుషారుగా స్టెప్పులేసింది. ఇది లవ్‌స్టోరీ. ఈ స్టోరీ ఇలా ఉంటే... అనుబంధ స్టోరీ ఇప్పుడు ఊహకందని కదలికను తెచ్చింది. 'ఈ పాట నాది, నేను సేకరించాను' అంటూ కోమలి అనే జానపద గాయని తెర మీదకొచ్చింది. ఓ దశాబ్దం కిందట తాను టీవీ ప్రోగ్రామ్‌లో పాడిన క్లిప్‌లను చూపిస్తోంది. అప్పుడు యాంకర్ ఉదయభాను ఆ ప్రోగ్రామ్‌ను రక్తి కట్టించడానికి అలవోకగా అన్న మాటలు ఇప్పుడు ప్రాముఖ్యత సంతరించుకుంటున్నాయి. 'కోమలి కాదన్నా కొడవలి, అన్న చూడు! సొంత రక్తం పంచుకున్న అన్నకంటే ఎక్కువ, అన్న ఈ పాటను యాడికో తీసుకుపోతడు' అని ఉదయభాను ఆనాడు అన్న మాటలకు 'అవును, అన్న ఈ పాటను యాడికో తీసుకుపోయాడు' అని ఇప్పుడు సుద్దాల అశోక్ తేజ మీద లెక్కలేనన్ని సెటైర్‌లు పడుతున్నాయి.

## సమన్వయ లోపమే

సమాజం చేత దోషిగా ముద్ర వేయించుకున్న సుద్దాల నిజానికి గొప్ప రచయిత. 'నేను సైతం... ప్రపంచాగ్నికి సమిధనొక్కటి ఆహుతిచ్చాను' అంటూ సాగిన శ్రీశ్రీ గేయంలోని ఉత్తేజం నింపే వాక్యాలను మకుటంగా తీసుకుని ఠాగూర్ సినిమా కోసం రాసిన పాట యావత్తు తెలుగు ప్రేక్షకుల్లోనూ చైతన్యాన్ని నింపింది. ప్రశంసలు చప్పట్లుగా మారాయి. 'ఇది నా వాక్యం' అనడానికి అప్పుడు శ్రీశ్రీ లేదు. ఇప్పుడు కోమలి ఉంది. అంతే తేడా. జానపద గేయాలు– సినిమా వాడకంలో ఇలాంటి వివాదాలు అప్పుడప్పుడూ ఉంటూనే ఉంటాయి. 'ఏం పిల్లడో ఎల్దమొస్తవా' అంటూ వంగపండు ప్రాచుర్యంలోకి తెచ్చిన ఉద్యమ గేయంలోని తొలి వాక్యాన్ని రామ్‌చరణ్ సినిమాలో వాడుకున్నప్పుడు కూడా ఓ తుఫాను చెలరేగింది. ఆ సమస్యను అల్లు అరవింద్ చక్కగా సమన్వయం చేసుకున్నాడు.

## ఆ బాణం నిర్మాత మీదకే

వంగపండు ధ్వజమెత్తింది పాట రచయిత మీద కాదు, సినిమా నిర్మాత మీద. రచయిత మీద ఈగ వాలకుండా జాగ్రత్త పడ్డాడు అల్లు అరవింద్. ఇక్కడ కోమలి ఎక్కుపెట్టిన బాణం నేరుగా పాట రచయిత సుద్దాల మీదకే. దాంతో ఇక్కడ ఇగో క్లాషెస్ మొద లయ్యాయి. అవి తీవ్రమైపోయాయి. మధ్యలో ఎవరైనా జోక్యం చేసుకుని పరిష్కరించే స్థాయి కూడా దాటి పోయింది, చిక్కుముడి కాస్తా పీటముడిగా మారి పోయింది. వివాద పరిష్కారం కోసం ప్రయత్నించిన ఒకరిద్దరు కూడా 'సుద్దాలకు చెడ్డ పేరు తీసుకు రావద్దు' అని సుద్దులు చెప్పేవాళ్లే అయ్యారు తప్ప కోమలి వైపు మాట్లాడేవాళ్లే కరవయ్యారు. టీవీ డిబేట్‌లో కూర్చో బెట్టిన తర్వాత యాంకర్ ఒక్కొక్కరినీ లైవ్‌లోకి తీసుకుని వచ్చి వికకాలంలో మూడు– నాలుగు వాదనలతో కోమలిని చుట్టుముడుతున్నారు. ఆమె దగ్గర ఉన్నది ఒకే ఒక్క వాక్యం. ఆ పాటను సేకరించిన వ్యక్తిగా తనను గుర్తించాలి. ఇందులో రెండవ వాదనకు తావులేదు. ఆ వాదనల్లో పాల్గొన్న చదువుకున్న వాళ్లలాగ ఒక విషయాన్ని పదిరకాలుగా సొంపుగా మలచగలిగిన నైపుణ్యం ఆమెకు లేదు. మనసు చెప్పిన మాటను తనకు తెలిసిన పరిమితమైన పదాల్లో వ్యక్తం చేయడం ఒక్కటే ఆమెకు తెలిసింది. ఆమెది ఏకవాక్య తీర్మానం. కోమలి పోరాటం కూడా ఒంటరి పోరాటమే. ఆమె పోరాడుతున్నది అలాంటి ఇలాంటి పాటల రచయితతో కాదు. నంది అవార్డు, జాతీయ అవార్డు పొందిన రచయితతో. ఇక టీవీలన్నీ ఈ పాట చుట్టూనే ఎందుకు తిరుగుతున్నాయో? ఎవరి భుజం మీద తుపాకీ పెట్టి ఎవర్ని షూట్ చేస్తున్నారో అర్థం కానంతగా అయోమయానికి గురి చేస్తుంటాయి డిబేట్‌లు. సుద్దాలకు కోపం రాకూడదు, కోమలి వైపు ఉ న్నట్లు కనిపించకపోతే వీక్షకులు చానెల్ మార్చేస్తారేమోననే భయంతో ఊగిసలాడుతున్నారు యాంకర్లు. ఇంత జరుగుతున్నప్పటికీ 'మీరిలా ఎందుకు చేశారు' అని సుద్దాలను సూటిగా అడగగలిగిన ధైర్యం యాంకర్లలో కొరవడినట్లుంది.

### 'సారంగ' అంటే?

*సారంగ అంటే సింధీ భాషలో 'రంగు రంగుల, రంగుల మయమైన' అని అర్థం. రంగురంగుల పక్షిని సారంగ పక్షి అంటారు. సారంగపక్షిని ధరించిన వాడు 'సారంగధరుడు' అని రాజరాజనరేంద్రుడి కొడుకు సారంగ ధరుడని ఒకరు భాష్యం చెబితే, తెలంగాణలో సారంగ అనే సంగీతవాద్యం ఉందని, ఆ వాద్యాన్ని వాయిస్తున్న అమ్మాయే సారంగదరియ అని సుద్దాల వివరించారు. సారంగ అంటే ధనుస్సు అనే అర్థం కూడా ఉంది. సారంగపాణి అంటే చేతిలో ధనువును పట్టుకున్న వాడు అని అర్థం.*

## సమాజం కోమలి వైపే

'న్యాయం కోసం చట్టాన్ని ఆశ్రయిస్తాం. కానీ చట్టం, న్యాయం ఈ రెండూ ఎప్పుడూ స్పష్టంగా ఒక పాత్రలో ఇమిడి ఉండవు. ఈ రెండింటినీ విడదీస్తూ కంటికి కనిపించని అద్దుగీత ఒకటి ఉండనే ఉం టుంది'. సినిమాల్లో ఈ డైలాగ్ బాగా పండుతుంటుంది. ఆ క్షణంలో ప్రేక్షకులు చట్టం మీద న్యాయమే గెలవాలని కోరుకుంటారు. ఈ వివాదంలో చట్టం సుద్దాల వైపు ఉండవచ్చేమో కానీ న్యాయం మాత్రం కోమలి వైపే ఉంది. సమాజం కోమలి కోణం నుంచే చూస్తోంది. ఈ పాట వివాదంలో సుద్దాల చట్టాన్ని ఆశ్రయించడం ద్వారా నైతిక అపజయాన్ని మూటగట్టుకున్నట్లయింది. 'కోమలికి పదివేలిప్పిస్తాను' అని మధ్యవర్తిత్వం చేయించడానికి పూనుకోవడం సుద్దాల గౌరవాన్ని ఆమాంతం నేలకు దించేసినట్లయింది. టైటిల్స్‌లో పేరు వేయించడానికి ప్రయత్నిస్తానని హామీ ఇచ్చి ఉంటే సమాజంలో ఆయన పట్ల ఉన్న గౌరవం ఇంకా సమున్నత స్థాయిలో నిలిచేది.

## ఇది చౌర్యం కాదా!

జానపదం అందరిదీ, ఎవరికీ పేటెంట్ ఉండదని వాదించడం కూడా అంత గొప్ప రచయిత స్థాయికి తగ్గట్టు లేదు. మనం ఒకసారి సీతాఫలాల కాలాన్ని గుర్తు చేసుకుందాం. బంజారాలు అడవుల్లో సీతాఫలాలను సేకరించి బండ్లలో నింపుకుని నగరానికి తెస్తారు. బుట్టల్లో పేర్చి అమ్ముకుంటారు. అవి వాళ్లు పండించినవి కాదు, కొని తెచ్చినవి కూడా కాదు. అవి ప్రకృతి ఇచ్చిన ఫలాలు కాబట్టి, అందరికీ హక్కు ఉంటుందని... బంజారాలు ఏ నీళ్ల కుళాయి దగ్గరకో పోయిన సమయం చూసి వాళ్ల బుట్టల్లోని కాయలను తెచ్చుకుంటామా? తెచ్చుకుంటే అది చౌర్యం కాకపోతుందా?



# వివరణ ఇవ్వండి



## - ఎస్ఇసి నిమ్మగడ్డ రమేష్‌కుమార్‌కు ప్రివిలేజ్ కమిటీ లేఖ

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్‌పై విచారణ చేపట్టాలని శాసనసభా హక్కుల కమిటీ తీసుకున్న నిర్ణయం సంచలనం కలిగిస్తోంది. రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి ఇచ్చిన ఫిర్యాదులపై ప్రివిలేజ్ కమిటీ ఛైర్మెన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన ఈనెల 17న వర్చువల్ విధానంలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎస్ఇసి నిమ్మగడ్డ రమేష్ కుమార్ నుంచి వివరణ కోరాలని అసెంబ్లీ ప్రివిలేజ్ కమిటీ నిర్ణయించిందని కమిటీ ఛైర్మెన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. సమావేశం అనంతరం కాకాణి నెల్లూరులో విలేకర్లతో మాట్లాడుతూ ఆ వివరాలు తెలిపారు. తన వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీస్తూ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ గత ఫిబ్రవరి 7వ తేదీన జారీచేసిన ఆదేశాలపై స్పీకర్ తమ్మినేనికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఫిర్యాదు చేయడం జరిగింది. తాను ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగిస్తున్నానని, దౌర్జన్యాలు చేస్తున్నానని, రాజ్యాంగవిరుద్ధంగా వ్యవహరిస్తున్నానంటూ ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ తనపై నిరాధారమైన ఆరోపణలు చేశారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. స్పీకర్ ఆ ఫిర్యాదును ప్రివిలేజ్ కమిటీకి పంపించారు. ఫిర్యాదుపై విచారణ జరిపిన ప్రివిలేజ్ కమిటీ ఈ విషయమై తగు చర్యలు చేపట్టాలని నిర్ణయించినట్లు కాకాణి వెల్లడించారు. మంత్రి పెద్దిరెడ్డి ఫిర్యాదును విచారణకు స్వీకరించామని, ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్‌కు ఈ విషయమై వ్యక్తిగతంగా కానీ, లేదా లిఖిత పూర్వకంగా గానీ వివరణ ఇచ్చే అవకాశం కల్పించామని, ఇందుకు సంబంధించిన లేఖను అసెంబ్లీ కార్యదర్శి ద్వారా రమేష్‌కుమార్‌కు పంపుతున్నామని కాకాణి తెలిపారు. అందువల్ల నిమ్మగడ్డ రమేష్‌కుమార్ అందుబాటులో ఉండాల్సిందిగా ఆయనకు అసెంబ్లీ కార్యదర్శి ద్వారా నోటీసులు జారీ చేశామన్నారు. "ఈ విషయంలో మీ స్పందన అవసరం కావచ్చు. కమిటీ ముందు మీ వ్యక్తిగత హాజరు అవసరపడవచ్చు' కనుక అందుబాటులో ఉండాలని ఎస్ఇసికి సమాచారం పంపించినట్లు ఆయన చెప్పారు. ఎస్ఇసి రమేష్‌కుమార్ నుంచి వివరణ వచ్చిన తర్వాత తదుపరి అంశాలను పరిశీలిస్తామని కాకాణి వివరించారు. ఈ సమావేశంలో ప్రివిలేజ్ కమిటీ సభ్యులు శిల్పా చక్రపాణిరెడ్డి, మల్లాది విష్ణు, వెంకట చినఅప్పలనాయుడు, టిడిపి సభ్యుడు సత్యప్రసాద్ పాల్గొన్నారు.



శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామివారు మార్చి 15వ తేదీ సోమవారం హైదరాబాదులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో కోవిడ్ టీకా వేసుకున్నారు. దేశ ప్రజలందరూ కోవిడ్ వ్యాక్సిన్ వేసుకుని కరోనాను నివారించి తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలని ఈ సందర్భంగా జీయర్ స్వామి పిలుపునిచ్చారు.

# సీఎం జగన్‌కు ఆ దేవదేవుని ఆశీస్సులు ఎల్లకాలం ఉండాలి

## - పెంచలస్వామిని దర్శించుకున్న ఆనం

జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన రాపూరు మండలం పెంచలకోనలో వెలసివున్న శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని ఈనెల 17న మాజీమంత్రి, వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన వెంట వెంకటగిరి పురపాలక సంఘం నూతన కౌన్సిలర్లు కూడా ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి – భారతమ్మ గోత్ర నామాలతో ఆలయంలో ప్రత్యేకపూజలు జరిపించామని చెప్పారు. సిఎం జగన్‌కు ఎల్లవేళలా శ్రీవారి ఆశీస్సులు ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. జగన్మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుకున్నామన్నారు. వెంకటగిరి మున్సిపాలిటీ చరిత్రలోనే కనీవినీ ఎరుగని విధంగా 25 వార్డు స్థానాల్లో వైయస్సార్సీపీకి అఖండ విజయం సాధించిపెట్టారని, ఈ సందర్భంగా ఆయన ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. అందరికీ ఆ దేవదేవుని ఆశీస్సులు ఉండాలని కోరుకున్నామన్నారు.



# బిజెపితోనే రాష్ట్రాభివృద్ధి

## నెల్లూరులో సోము వీర్రాజు



బిజెపితోనే రాష్ట్రంలో నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు చెప్పారు. ఈనెల 17న ఆయన నెల్లూరులో జరిగిన బిజెపి కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ ప్రధాని మోదీ దేశానికి చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వం ఆ పార్టీ అభివృద్ధికి, ఎన్నికల్లో గెలుపుకు వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసుకుని ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నదంటూ ఆరోపించారు. అయితే రానున్న రోజుల్లో ప్రజలు బిజెపికే పట్టం కట్టబోతున్నారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. బిజెపిని ఏ శక్తి అడ్డుకోలేదన్నారు. దేశం కోసం పనిచేయడమే బిజెపి లక్ష్యమని, అందుకోసం కార్యకర్తలు ధైర్యంగా ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోను, మునిసిపల్ ఎన్నికల్లోనూ బిజెపి తరపున ఎంతో నమ్మకంతో పనిచేసిన ప్రతి కార్యకర్తకు పార్టీ నుంచి మంచి గుర్తింపు ఉంటుందన్నారు. ఈ సమావేశంలో బిజెపి నాయకులు సురేష్‌రెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డి, సురేంద్రరెడ్డి, భరత్‌కుమార్, కాకు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# దేశంలో మళ్ళీ కోరలు చాచిన కరోనా

దేశంలో కరోనా మహమ్మారి మళ్ళీ విజృంభిస్తోంది. క్రమంగా కొత్తగా నమోదవుతున్న కేసులతో పాటు, క్రియాశీల కేసుల సంఖ్యలోనూ పెరుగుదల కనిపిస్తోంది. గడిచిన 24 గంటల్లో 10.63లక్షల పరీక్షలు చేయగా.. 35,871 మందికి కరోనా పాజిటివ్‌గా తేలింది. ఈ విషయాన్ని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ గురువారం వెల్లడించింది. దీంతో మొత్తం కేసుల సంఖ్య 1,14,74,605కి చేరింది. కొత్తగా 17,741 మంది వైరస్ బారి నుంచి బయటపడ్డారు. దీంతో మొత్తం రికవరీల సంఖ్య 1,10,63,025కు చేరి.. రికవరీ రేటు 96.65శాతం నుంచి 96.56శాతానికి తగ్గింది.

మరోవైపు కరోనా మరణాలు మంగళవారంతో పోలిస్తే గత 24గంటల్లో కొంతమేర తగ్గాయి. మంగళవారం రికార్డు స్థాయిలో 188 మరణాలు నమోదు కాగా.. గడిచిన 24 గంటల్లో 172మంది ప్రాణాలు కోల్పోయారు. దీంతో మహమ్మారి వెలుగులోకి వచ్చిన నాటి నుంచి దేశవ్యాప్తంగా కరోనాతో మరణించిన వారి సంఖ్య 1,59,216కి చేరింది. ఇక మరణాల రేటు 1.39 శాతంగా కొనసాగుతోంది.

ప్రస్తుతం దేశవ్యాప్తంగా క్రియాశీల కేసుల సంఖ్య 2,52,364కి పెరిగింది. మరోవైపు దేశంలో కరోనా వ్యాక్సిన్ ప్రక్రియ వేగంగా సాగుతోంది. గడిచిన 24గంటల్లో 20లక్షల మందికి టీకా వేశారు. దీంతో ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా మొత్తం టీకా అందిన వారి సంఖ్య 3,71,43,255కి చేరింది.

కరోనా విజృంభిస్తున్న ఈ తరుణంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సూచించిన మేరకు ప్రతిఒక్కరూ తప్పకుండా మాస్కు ధరించాలని, తరచూ చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలని, శానిటైజర్లు వినియోగించాలని, గుంపులు గుంపులుగా తిరగకుండా సామాజిక దూరం పాటించాలని వారు సూచిస్తున్నారు. కరోనా తగ్గిపోయిందిలే అనే నిర్లక్ష్యం వద్దనే వద్దని... దేశంలోని అనేక రాష్ట్రాల్లో నూరు నుంచి 150 శాతం దాకా కోవిడ్ కేసులు పెరుగుతున్నాయని వారు పేర్కొంటున్నారు. కరోనా నివారణకు టీకా తప్పనిసరని, దశల వారీగా అందుబాటులోకి వస్తున్న ఈ వ్యాక్సిన్‌ను ప్రజలందరూ వేయించుకుని కరోనా బారిన పడకుండా ఉండాలని సూచిస్తున్నారు.




Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com